# కర్నూలు | నంద్యాల వార్త

26 ఆగస్టు , 2023 | శనివారం | పేజీలు 4

## గైర్హాజరైన డాక్టర్లపై కలెక్టర్ ఆగ్రహం..!

**- సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి : జిల్లా కలెక్టర్**



**నంద్యాల, ఆగష్టు 25, ప్రభాతవార్త:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసిబ్బంది పనితీరు మెరుగుపర్చుకుని రోగులకు క్రమశిక్షణతో మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్ ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, గ్రామసచివాలయం-2ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో హాజరుపట్టికను పరిశీలిస్తూ డా.శ్రావణి, ఫార్మసిస్టు మహేశ్వరి, ఇతర వైద్య సిబ్బంది గైర్హాజరు కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత వ్యక్తులకు షోకాజు నోటీసులు జారీ చేసి సంజాయిషీ సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.రాగిరి వెంకటరమణను ఆదేశించారు. మెటర్నటీ రిజిస్ట్రరు, అటెండెన్స్ రిజిస్ట్రర్‌ను పరిశీలించి విధుల పట్ల క్రమశిక్షణతో ఉండడం లేదని తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయం-2ను సందర్శించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేను పూర్తిచేయాలని ఆదేశించారు. నెలలో నాలుగుసార్లు సచివాలయాలను రెగ్యులర్ తనిఖీ చేయాలని ఎంపీడీఓ, తహాశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. తదుపరి రుద్రవరం మండలంలోని చందలూరు గ్రామంలో ఫ్యామిలి ఫిజిషియన్ విధానాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ ఎంతమంది రోగులు రోజు వస్తున్నారని ఏఎన్ఎం, ఆశావర్కర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీగిరిలో వైభవంగా.. సామూహిక వరలక్ష్మి వ్రతం..!



**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు25, ప్రభాతవార్త :** శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహణలో భాగంగా దేవస్థానం శ్రావణ రెండవ శుక్రవారం రోజున ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించడం జరిగింది. ఈక్రమంలోనే ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేయగా దాదాపు 1000 మందికి పైగా వరలక్ష్మి వ్రతంలో ముత్తైదువులు పాల్గొనడం జరిగింది. వరలక్ష్మి వ్రతంల శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న దంపతులు పాల్గొన్నారు.కాగా ఈ వ్రతాలకు కావాలసిన పూజాద్రవ్యాలన్నింటిని దేవస్థానమే సమకూరి్చంది.కాగా వ్రత కార్యక్రమంలోపాల్గొనే ప్రతీ ముత్తైదువుల కోసం వేరు వరుగా కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా ఈవ్రతం జరిపించబడింది. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వ్రతంలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ నిర్వహించబడింది.తరువాత వేదికపై వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపించబడ్డాయి.అదే విధంగా వ్రతాన్ని జరిపించుకున్న ముత్తేదువులందరికి అమ్మవారి శేషవస్త్రాలుగా రవికగుడ్డ, పూలు, గాజులు,శ్రీశైలప్రభ మాసపత్రిక, ప్రసాదం,శ్రీస్వామిఅమ్మవార్ల కైలాస కంకణాలు కూడా అందజేయడం జరిగింది.అదే విధంగా ముత్తైదువులందరికి ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించబడింది.తదనంతరం దేవస్థానం అన్నపూర్ణ భవనం నందు ముత్తైదువులందరికి అన్నప్రసాదాలు ఏర్పాటు చేయడం జరిగింది.



# సంక్షేమంపై సమీక్ష

- : ఆగస్ట్ 31 లోపు రైతు భరోసా కేంద్రాలు
- : విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తి కావాలి
- : గడువు లోపు నాడు - నేడు పనులు పూర్తి చేయాలి
- - జిల్లా కలెక్టర్ డా.సృజన

**ఆగస్ట్ 31 లోపు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్లను జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, హౌసింగ్, మన బడి-నాడు తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ మండల వారీగా సమీక్షించారు..**



**కర్నూలు, ఆగస్టు 25, ప్రభాతవార్త :** బేస్ మెంట్ స్థాయికి పైన ఉన్న 183 రైతు భరోసా కేంద్రాలు, 179 విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు ఆగస్ట్ 31 వ తేదీ లోపు పూర్తయ్యే విధంగా ప్రణాళికా బద్ధంగా పని చేయాలని కలెక్టర్ పంచాయతీరాజ్ ఇంజనీర్ లను ఆదేశించారు.. ఫ్లోరింగ్, ఎలక్ట్రిక్, పెయింటింగ్, ప్లంబింగ్ తదితర పనులకు సంబంధించి రూపొందించుకున్న ప్రణాళికను సంబంధిత మండలాల ఎంపిడిఓ లకు ఇచ్చి, ప్రతి రోజు ప్రణాళిక ప్రకారమే పనులు జరిగే విధంగా చూసుకోవాలని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్‌లను, ఎంపిడిఓ లను కలెక్టర్ ఆదేశించారు. అలాగే సెప్టెంబర్ 15 నాటికి 240 సచివాలయ భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. నాడు-నేడు కి సంబంధించి ఎక్స్పెండిచర్ బుక్ చేయడంలో చాలా తక్కువ శాతం పురోగతి సాధించారని, అందులో హోళగుంద 81 శాతం మాత్రమే పురోగతి సాధించారని, ఎక్స్పెండిచర్ ఎక్కువగా బుక్ చేసి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 312 పాఠశాలలలో నిర్మిస్తున్న 1312 అదనపు తరగతి గదుల నిర్మాణాలను సెప్టెంబరు 30వ తేదీ నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి అన్ని వసతులు ఏర్పాటు చేసి ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూలు)గా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో కు సంబంధించి 5-18 సంవత్సరాల మధ్య ఉన్న ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్పే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాలంటీర్ల లాగిన్ లో ఉన్న వివరాలను అప్డేట్ చేసి మెయిన్ స్ట్రీమ్ చేయాలన్నారు. హౌసింగ్ కి సంబంధించి ముఖ్యంగా ఆప్షన్-3 కింద ఇళ్ళ నిర్మాణాల పురోగతి తక్కువగా ఉందని, సంబంధిత కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ (ఇంఛార్జి) పిడిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి బుధవారం మండలాల స్పెషల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన మండలాలను పర్యటించి ఆప్షన్-3 కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి పురోగతి సాధించాలన్నారు. కన్సిస్టెంట్ రిథమ్స్ తనిఖీలో భాగంగా పాఠశాలలను, వసతి గృహాలను, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయడంలో పురోగతి సాధించడం లేదని, సంబంధింత వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తనిఖీ చేసి అందులో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్ని మండలాల ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, ఎస్ఎస్ఏ పిఓ డా.కె.వేణుగోపాల్, జిల్లా విద్యా శాఖధికారి రంగారెడ్డి, హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ మల్లిఖార్జునుడు, హౌసింగ్ (ఇంఛార్జి) పిడి సిద్ధలింగమూర్తి, ఐసిడిఎస్ (ఇంఛార్జి) పిడి వెంకట లక్ష్మమ్మ సంబంధిత శాఖ అధికారులు, ఎంఈఓలు, సిడిపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణం నరకప్రాయం..!

- అస్తవ్యస్తంగా మారిన రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**కౌతాళం, ఆగస్టు25, ప్రభాతవార్త ;** మండలంలోని రహదారులు అస్తవ్యస్తంగా అధ్వానంగా మారడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడ పడితే అక్కడ రహదారులకు గుంతలు ఏర్పడడంతో గంటల కొద్దీ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే..... కౌతాళం-బాపురం చెక్‌పోస్టు కర్నాటక సరిహద్దు వరకు ఉన్న 7 కి.మీ. రహదారికి గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. శ్రావణమాసం మొదలుకొని వారం గడుస్తున్నా కర్ణాటక నుంచి వచ్చే భక్తులకు ప్రయాణణ నరకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి మరమ్మతులను చేయడంలో ఆర్అండ్‌బి అధికారులు విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## ఎస్సై నియామక దేహ ధారుడ్య పరీక్షలు

**: పరుగు పరీక్షలను జెండా ఊపి ప్రారంభించిన డిఐజి శ్రీ ఎస్. సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్**

**కర్నూలు, ఆగస్టు 25, ప్రభాతవార్త :** పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్ కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు (ఆగష్టు 25 తేది) శుక్రవారం నుండి కర్నూలు ఏపీఎస్‌పీ 2వ బెటాలియన్‌లో దేహదారుడ్య పరీక్షలు మొదటి రోజు ప్రారంభమయ్యాయి. ఈ సంధర్భంగా కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్‌లు దేహాదారుడ్య సామర్థ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు. ఈ సంధర్భంగా కర్నూలు రేంజ్ డిఐజి మీడియా తో మాట్లాడుతూ ఎస్సై ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ రోజు నుండి ఫిజికల్ మెజర్ మెంట్, ఫిజికల్ ఎఫిషియన్స్ టెస్ట్ లు ప్రారంభమయ్యాయి . రాయలసీమ రేంజ్ పరిదిలో 16 వేల 108 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారు. ( 14,011 మంది పురుషులు, 2, 097 మంది మహిళ అభ్యర్థులు) ప్రతి రోజు 8 వందల మంది అభ్యర్థులు దేహ దారుడ్య పరీక్షలలో పాల్గొంటారని , పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు ఆదేశాలు జారీ చేసిందన్నారు. రోజూ ఉదయం 5 గంటల నుండి దేహాదారుడ్యల పరీక్షల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. అన్ని ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాము. ప్రతి రోజు అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన చేస్తారు. ఎత్తు, చాతీ వంటి ఫిజికల్ మెజర్ మెంట్స్ చేస్తారు. తర్వాత బయోమెట్రిక్ తీసుకుంటారు. దేహాదారుడ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు విరామ సమయం ఉంటుంది. దేహ దారుడ్య పరీక్షల దగ్గర ఎక్కడ కూడా ఏలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్ఎఫ్ఐడి కంప్యూటరైజ్డ్ టెక్నాలజితో పకడ్బందీ ఏర్పాట్లు చేసాము. డిజిటల్‌గా, పారదర్శకంగా ఈ వెంట్స్ నిర్వహిస్తున్నాము. ఎస్సై అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తామంటూ దళారుల మాటలు నమ్మవద్దని , ప్రలోభాలకు గురికావద్దని విజ్ఞప్తి చేస్తున్నాము. ఆగష్టు 25 వ తేది నుండి సెప్టెంబర్ 20 వ తేది వరకు ఈ వెంట్స్ జరుగుతాయి. సమస్యలపై అప్పీల్ చేసుకునే వారు రిక్విజేసేన్ రాసి ఇచ్చి , సర్టిఫికెట్ వెరిఫికెషన్ లో ఏదైనా లోపాలు ఉంటే సెప్టెంబర్ 21 వ తేదిన అప్పీలుకు రావలని తెలిపారు. రాయలసీమ రేంజ్ పరిధిలో కర్నూలు జిల్లా ఎస్పీతో పాటు ఇతర జిల్లాల ఎస్పీల సహాకారంతో 300 మంది పోలీసు సిబ్బంది రోజు ఉదయం 4 గంటల నుండి దేహాదారుడ్యల ప్రక్రియ దగ్గర విధులు నిర్వహిస్తున్నారు. పకడ్బందీగా పని చేయాలని బ్రీఫింగ్ ఇవ్వడం జరిగింది. పరుగు పందెంలో పాల్గొనే అభ్యర్థులకు అత్యవసర పరిస్థితులలో ఏదైనా జరిగితే అంబులెన్స్, డాక్టర్స్ వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశాము. దేహాదారుడ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఖచ్చితంగా ఒరిజినల్ ధువపత్రాలతో హాజరు కావాలని, లేటెస్ట్ కుల దృవీకరణ సర్టిఫికెట్ , క్రిమిలేయర్ సర్టిఫికెట్ తీసుకురావాలి. వాటితో పాటు ఆధార్, అడ్మిట్ కార్డు, స్టడీ, మార్కులిస్టులు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ సర్టిఫికెట్లు ( గెజిటెడ్ సంతకం) తప్పనిసరిగా తీసుకుని రావలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగబాబు, డిస్పీలు, డిపిఓ ఏవో సురేష్ బాబు, సిఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు ఉన్నారు.



## రాష్ట్రంలోజగన్ అరాచక పాలనకు అంతం పలకాలి : బైరెడ్డి

- కక్ష సాధింపులో రామోజిరావును కూడ వదలడంలేదు
- చట్టాలపై జగన్ ప్రభుత్వానికి గౌరవం లేదు
- ఎపియుడబ్ల్యూజె జర్నలిస్ట్ రిలే దీక్షలకు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సంఘీబావం



2లో



**నంద్యాల, ఆగష్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతొందని, ప్రకృతి వనరులు భవిషత్ తరాలకు లేకుండా వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దోపిడి జరుగుతొందని, అది తప్పు అన్న ప్రతిపక్ష పార్టీలపై, మీడియాపై దాడులు, అక్రమ కేసులుపెడుతున్నారని, చివరికి తప్పులను ఎత్తి చూపుతున్న రామోజీరావును కూడా వదలడంలేదని సీనియర్ నాయకులు మాజీ ఎమ్మేల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.

## పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు..!

**- లింగంపల్లి గడప గడప కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం**

**ఆలూరు/హొళగుంద, ఆగష్టు 25, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గంలోని హొళగుంద మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమానికి మంత్రి గుమ్మనూరు జయరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి గుమ్మనూరు జయరాంకు గ్రామసర్పంచ్ భర్త విరుపాక్షిరెడ్డి, గ్రామంలోని వైకాపా యువ నాయకులు మౌనేష్, శంభులింగ, ఈశ్వర్‌లు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి జయరాం మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా ప్రజాసంక్షేమమే తన ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన కొనసాగిస్తున్నార న్నారు. కుల,మత,వర్గ భేదాలు లేకుండ అన్నివర్గాల ప్రజలకు సామాజిక అభివృద్ధి చేసిన వైకాపా ప్రభుత్వం అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రాజకీయ పదవులు కట్టబెట్టార న్నారు. గ్రామ సచివాలయానికి రూ. 20లక్షలు మంజూరు చేయడం జరిగిందని గ్రామంలో కల్వర్లు, సిసిరోడ్లు, డ్రైనేజీలు తదితర వాటికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. లింగంపల్లి గ్రామానికి ఇప్పటివరకు రూ.11కోట్ల25లక్షల నిధులు ఇవ్వడం జరిగింద న్నారు. అలాగే విద్యార్థిని,విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు, బూట్లు అందచేయడం జరిగిందన్నారు. అలాగే నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి పెద్దపీట కల్పించారన్నారు. నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడం మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుందన్నారు. ఆలూరు నియోజకవర్గంలో కొత్తగా రాజకీయ బిచ్చగాళ్లు ప్రారంభమయ్యారని వారిని నమ్మొద్దని తెలిపారు. అంతకుముందు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న మాల గీత కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందచేశారు. అలాగే సచివాలయ సిబ్బందితో మంత్రి జయరాం మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు,గజ్జహళ్లి వైస్ ఎంపిపి మహదేవమ్మ తనయుడు కెంచప్ప,వైస్ ఎంపిపి భర్త హనుమప్ప,వైకాపా సీనియర్ నాయకుడు కోగిలతోట శేషప్ప,ఎంపిపి తనయుడు ఈసా,సొసైటీ చైర్మన్ మల్లికార్జున,మండల కన్వీనర్ షఫీవుల్లా,ఎంపిటిసి రత్నమ్మ,వైసిపి జిల్లా కార్యదర్శి రామ్‌భీమ్ నాయుడు, అయ్యాళ్లప్ప, రామకృష్ణ, కుమారస్వామి,బోర్డు అడ్వైజరింగ్ చైర్మన్ ఇంగళదహాల్ మల్లికార్జున,కోగిలతోట మాజీ సర్పంచ్ వెంకటేష్,ఎల్లార్తి ఈరన్న,నెరణికి రవిస్వామి తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్తు బిల్లుల మోత.. కరెంటు కోతలు



**: పద్దతి లేకుండ కరెంటు సరఫరా నిలిపివేత**
**: ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

**ప్యాపిలి ఆగస్టు25, ప్రభాతవార్త:** మారుతున్న కాలానుగుణంగా మానవ అవసరాలు పెరిగాయి. గతంలో నింపాదిగా, సాఫీగా సాగిన జీవన పయనం నేడు హంగు, ఆర్భాటాలు, విలాసవంతమైన సౌకర్యాల మధ్య గజిబిజిగా నడుస్తోంది. పూర్వం ఆహారం, నీరు లేకపోతే బతకలేని పరిస్థితులు ఉంటే నేడు విద్యుత్తు, సెల్‌ఫోన్, నెట్‌వర్క్‌లు లేకపోతే బతుకు బండి అడుగు ముందుకు పడదు. జీవన వ్యయం పెరిగినప్పటికి తగ్గేదెలా అన్న రీతిలోనే జీవన పయనాన్ని కొనసాగిస్తున్నారు. నిత్యం అత్యవసరంగా మారిన విద్యుత్తు సరఫరాలో కలుగుతున్న అంతరాయాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. నిర్ధేశిత సమయమంటూ లేకుండ ఇష్టారాజ్యంగా కరెంటు సరఫరాను నిలిపేస్తున్నారు. దీనికి తోడు కరెంటు చార్జీల మోత మోగుతుండగా, మరోవైపు కరెంటు కోతలు ఊపిరి ఆడనివ్వడం లేదని ప్రజలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు బిల్లులు అధికంగా వస్తున్నా అష్టకష్టాలు పడి చెల్లిస్తున్నామని, అయినప్పటి వేళపాళా లేకుండ కరెంటు కోతలు ఎందుకు అమలు చేస్తున్నారని నిలదీస్తున్నారు. ప్రతి రోజు ఐదు గంటల నుండి ఆరు గంటల వరకు అనధికారికంగా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారని, ముఖ్యంగా రాత్రిపూట కరెంటు ఉండటం లేదని దీని వల్ల నిద్రాభంగం కలుగుతుందని వాపోతున్నారు. చివరకు ఇస్రో ప్రయోగించి చంద్రయాన్-3 చంద్రునిపై ల్యాండింగ్ సన్నివేశాలను టివిలలో వీక్షించడానికి వీలు లేకుండ ఆ సమయంలోనే కరెంటు లేకుండ చేశారని యువత దుమ్మెత్తి పోస్తున్నారు. ఏమైనా మరమ్మత్తులు ఉంటే నిర్ధేశిత సమయాలను ప్రకటించి చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికైన ట్రాన్స్‌కో అధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్తు కోతలను నివారలించాలని ప్రజలు కోరారు.

## శరవేగంగా.. శ్రీశైలం సిబ్బంది నివాస గృహాలు



**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు25, ప్రభాతవార్త** శ్రీశైలందేవస్థానం సిబ్బంది నివాస గృహాల పనులు సుండిపెంటలో శరవేగంగా కొనసాగుతున్నాయి.కాగా 297 నివాస గృహాలను 11 బ్లాకులుగా విభజించి పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఈ పనులను టెండర్ ప్రక్రియ ద్వారా హైదరబాద్‌కు చెందిన వై.వి.ఆర్. కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులను దకి్కంచుకుంది. రమారమి రూ.39 కోట్ల వ్యయంతో ఈ యొక్క నివాస గృహాలను నిర్మించడం జరుగుతుంది.ఈ పనులను వేగవంత పరచే దశలో శ్రీశైలం దేవస్థానం ఈఓ ఎస్.లవన్న పనుల యొక్క తీరుతెన్నులను స్వయానా అదికారులతో కలసి పర్యవేక్షించడం జరుగుతుంది.ఈ నేపధ్యంలోనే నివాస గృహాల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు శ్రీశైలదేవస్థానం ఈఈలు రామకృష్ణ, మురళీధర్‌రెడ్డిలతో వివారాలు అడిగితెలుసుకుంటూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని సూచనలు చేయడం జరుగుతుంది.శ్రీశైలంలో సిబ్బంది నివాస గృహాల ఇక్కట్లును తొలగించే క్రమంలో ఈఓ ఎస్.లవన్న సుండిపెంటలోని నివాస గృహాలను వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి సిబ్బంది కళను నేరవేర్చేందుకు పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించడం జరుగుతుంది.



## ప్రభుత్వ కార్యాలయాలను అపవిత్రం చేస్తున్న అధికారి...?

- : కామాందుడి అధికారిపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు
- : సచివాలయ సిబ్బందే ఆ అధికారి టార్గెట్
- : మున్సిపాలిటిలో అసలు ఏమి జరుగుతుంది

**ఆత్మకూరు ఆగష్టు25, ప్రభాతవార్త:** పవిత్రమైన ప్రభుత్వ కార్యాలయాలను ఆపవిత్రం చేస్తున్న అధికారి తీరుపై ఏకంగా నంద్యాల జిల్లా కలెక్టరుకు పిర్యాదు చేసిన సంఘటన బుదవారం పట్టణంలో సోషల మీడియాలో వైరల్‌గా మారిన తీరుపై ఆ కామాందుడి అధికారిపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన ఓ సామాన్య వ్యక్తి రాసలీల అధికారిపై ప్రత్యేక నిఘా ఉంచి ఆ అధికారి చేసిన తప్పుడు పనులను అధికారులు ముంగిట విడియో రూపంలో పిర్యాదు చేశారు. సామాజిక మద్యమాలలో ఈ విషయం వైరల్‌గా మారడంతో ఆ అధికారిపై మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న రెండో క్యాడర్ అధికారి తన మెయిల్‌లో వచ్చిన ఫిర్యాదును పరిశీలన చేసిన్నట్లు సిబ్బంది చర్చించుకుంటున్నారు. కామంతో కండ్లు మూసుకోని సచివాలయ సిబ్బందినే టార్గెట్ చేస్తూ మానసిక వత్తిడికి గురి చేయడంతో కొందరు..

2లో

## నేను రాకూడదా.. జేసీ..!

**- మాకు ఇక్కడ సోలార్ వద్దు సార్**
**- జేసీతో వాగ్వాదానికి దిగిన ప్రజాప్రతినిధులు**



**మిడుతూరు, ఆగస్టు25, ప్రభాతవార్త ;** గ్రామ ప్రజలు, సర్పంచుల అభిప్రాయం తీసుకోకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్ కోసం పొలాలు ఎలా పరిశీలిస్తారని ప్రజాప్రతినిధులు ప్రశ్నించగా, అయితే నేను రాకూడదా, ఇక్కడ మీరు అరిస్తే సమస్య పరిష్కారంకాదని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించడంతో ఇరువురు మధ్య వాగ్వాదం చోటు చేసు కుంది. వివరాలు ఇలా...

2లో

# రాష్ట్రంలోజగన్ అరాచక పాలనకు అంతం పలకాలి : బైరెడ్డి

**(తరువాయి)** శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ ముందు ఏపియుధభ్ల్యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహానంది వార్త విలేకరి మధుపై దాడి చేసి అతనిపై అక్రమ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ చేస్తున్న రిలే నిరాహార దీక్షకు బైరెడ్డి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతు రాజ్యాంగ విలువలకు జగన్ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని మహానంది మండలంలో అటవీ భూములను వైసిపి నాయకులు అక్రమిస్తే అది తప్పు అని మహానంది విలేకరి మధు వార్త రాస్తే ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా నిజాన్ని ప్రజల ముందు వుంచిన విలేకరి మధుపై ఎమ్మెల్యే, అధికారుల సమక్షంలో వైకాపా నాయకులు దాడి చేయడం, మళ్ళీ విలేకరిపైనే కేసు పెట్టడం జగన్ ప్రభుత్వ ఆరాచకాలకు నిలువెత్తు నిదర్శన ం అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేస్తుందని, చట్టాలపై అవగాహన గాని గౌరవం గాని లేదని, ఇసుక, మట్టి, అటవీ ఖనిజ సంపదను కొందరు వైసిపి ప్రజాప్రతినిధులు దోచుకుంటున్నారని, ముఠాలుగా ఏర్పడి ప్రభుత్వం ప్రైవేట్, అటవీ భూములను కబ్జాలు చేస్తున్నా రెవెన్యూ, అటవీ, పోలీసు వ్యవస్థలు అడ్డుకోలేని పరిస్థితి ఉందని ఆయన ఆంధోళన వ్యక్తం చేశారు. అడ్డగోలుగా అక్రమ సంపాదన చేసేవారికే అధికార ప్రతిపక్ష పార్టీలలో ప్రజాప్రతినిధులుగా అవకాశం ఇస్తున్నారని భాధ్యతగా ప్రజలకు సేవ చేసేవారికి అవకాశాలు కరువయ్యాయని, ప్రజలు మంచి రాజకీయ నాయకులను ఎమ్మెల్యేలుగా ఎం.పి.లుగా ఎన్నుకున్నప్పుడే ప్రజాస్వామ్యం నాలుగు కాలాల వర్ధిల్లుతుందని బైరెడ్డి ఆశాభావం వ్యక్త చేశారు. పాత్రికేయులపై దాడులు ప్రజాస్వామ్యంపై దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఎపియుధభ్ల్యూజె రాష్ట్ర కమిటీ సభ్యులు ఖండెశ్యాంసెందర్‌లాల్, ప్రింట్ మీడియా జిల్లా గౌరవాధ్యక్షులుమారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, అధ్యక్షులు మధు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు చలంబాబు, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలను అపవిత్రం చేస్తున్న అధికారి...?

**(తరువాయి)** విధి నిర్వహాణలో ఉండి ఆ అధికారి ఒత్తిడి బరించలేక పవిత్రమైన కార్యాలయంను ఆపవిత్రం చేసే విదంగా వెల్లడంతో కొందరు ఆ అధికారిపై ప్రత్యేక నిఘా ఉంచి అతను చేసిన రాసలీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ అధికారికి ప్రత్యేకంగా కొన్ని బిరుదులు వచ్చిన్నప్పటికి తనలో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదనేది. కొందరి సచివాలయ సిబ్బంది గతంలో రహస్యంగా మున్సిపల్ కమీషనర్ స్థాయి అధికారికి వారి గోడును విన్నవించుకున్నారు. ప్రస్తుతం ఈ విషయంపై ఆత్మకూరులో జోరుగా ఆ అధికారిపైనే చర్చలు కొనసాగించడంతో పట్టణం అంతా హాట్ టాపిక్‌గా మారిందని చెప్పవచ్చు.

## నేను రాకూడదా..జేసీ

**(తరువాయి)** మండలంలోని పైపాలెం, నాగలూటి గ్రామాల పరిధిలో గుట్ట ప్రాంతంలో విద్యుత్ సోలార్ ఏర్పాటుకు దాదాపు వెయ్యి ఎకరాలు గ్రీన్ కో కంపెనీ ప్రభుత్వాన్ని కోరింది. అందులో భాగంగా శుక్రవారం జేసీ రెండు గ్రామాల పరిధిలోని గట్టు ప్రాంతానికి పొలాల పరిశీలనకై వచ్చారు. అయితే సింగిల్‌విండో చైర్మన్ తమ్మిదల నాగతులసిరెడ్డి, సర్పంచ్ రామచంద్రుడు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు కలిసి జేసీ పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలు, గ్రామాల సర్పంచుల ఆమోదం లేకుండా ప్రజల తీర్మానం లేకుండా సోలార్ విద్యుత్‌కు భూమి ఎలా కేటాయిస్తారని వారు జేసీని ప్రశ్నించారు. మీరు ఇక్కడ అరవకండని జేసీ చెప్పగా, మాట్లాడితే అరవడం అంటే ఎలా అని వారు ప్రశ్నించారు. ప్రజల అభిప్రాయ సేకరణ చేసి, ఇక్కడ సమస్యలు, అభ్యంతరాలు పరిగణలోకి తీసుకొని సంబంధిత నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని జేసీ చెప్పెపరు. కనీసం ఎవరికి సమాచారం ఇవ్వకుండా పొలాల సరిహద్దుల్లో జెండాలు ఎలా పాతుతారని మాకు ఇక్కడ సోలార్ వద్దు సార్ ఇక్కడ ఉన్నది రైతులు, పశువులు, గొర్రెలు అధిక సంఖ్యలో ఉన్నాయి. వాటి గ్రాసం కొరత ఏర్పడుతుంది. ముఖ్యంగా సోలార్‌ప్లాంట్ ఏర్పడితే భారీ విద్యుత్ స్తంభాల వల్ల పెద్ద తీగల వల్ల పొలాల డిమాండ్ పడిపోతుందని, ఇప్పటికే గట్టు ప్రాంతం వేడిగా ఉందని, ఇక సోలార్ ఏర్పడితే మరింత వేడి ఏర్పడి పొలాలకు జీవరాసులకు ఇబ్బందిగా ఉంటుందని, సోలార్ కాకుండా ప్రజల ఆమోదంతో ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేయండి కానీ సోలార్‌మాకు వద్దు అంటూ ప్రజాప్రతినిధులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో త్వరలో గ్రాసేకరణ చేపడతామని మీరు చెప్పిన సమస్యలు అభ్యంతరాలు పరిగణలోకి తీసుకొని చర్చిస్తామని జేసీ అన్నినరు. ఏదేమైనా సోలార్ మాకు వద్దంటూ స్థానికులు జేసీకి తెగేసి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దాసు, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, చిన్న పుల్లారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, ఫకీర్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వసుధా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

**– 15 ఏళ్లగా ప్రజా సేవలో వసుధా ఫౌండేషన్ – మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి**



**బనగానపల్లెరూరల్, ఆగస్టు25, ప్రభాతవార్త:** వసుధా ఫౌండేషన్ ఏర్పాటుచేసి మంతెన వెంకటరామరాజు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణానికి చెందిన రెండు ఆర్యవైశ్య కుటుంబాల వారు ఆర్థికంగా వెనుకబడి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య వసుధా ఫౌండేషన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు వెంటనే స ్పందించిన వసుధా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.20వేలు ఆర్థిక సహాయం మంజూరు చేయడం జరిగింది. ఈ మేరకు శుక్రవారం బీసీ రాజారెడ్డి కార్యాలయం నందు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో బీసీ రాజారెడ్డి చేతుల మీదుగా వంకదారి శేషప్రసాద్ కుటుంబానికి రూ.10వేలు, గోట్ల శ్రీకాంత్ కుటుంబానికి రూ.10వేలు మొత్తం రూ.20వేలను పంపిణీ చేయడం జరిగింది. అదే విధంగా యనకండ్ల గ్రామానికి చెందిన చాంద్‌బాషాకు సంబంధించి ముగ్గురు పిల్లలు అంగవైకల్యంతో బాధపడుతున్నారు. వారి సమస్యను వసుధా ఫౌండేషన్ దృష్టికి తీసుకువెళ్లగా ఒక్కొక్కరికి రూ.1000ల చొప్పున ప్రతినెల ముగ్గురికి కలిపి రూ.3వేలు జీవితాంతం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి చెందిన మంతెన వెంకటరామరాజు వసుధా ఫౌండేషన్‌ను స్థాపించి గత 15 సంవత్సరాల నుంచి ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నరన్నారు. అలాగే కుల, మతాలకు అతీతంగా అర్హులైన వేలాది నిరుపేద కుటుంబాలకు వసుధా ఫౌండేషన్ తరుపున వారికి సహాయం అందించి ఆదుకున్నరన్నారు. అదే విధంగా విద్యార్థులకు ప్రత్యేకంగా స్కాలర్‌షిప్‌లు, నోటుపుస్తకాలు, పెన్నులు అందజేస్తూ విద్యాపరంగా వారిని ప్రోత్సహిస్తున్నరన్నారు. కరోనా సమయంలో కూడా వేలాది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడమే కాకుండా నిత్యవసర సరుకులు పంపిణీచేసి మానవతదృక్పథాన్ని చాటుకున్నరన్నారు. స్థానికంగా టంగుటూరు శీనయ్య, ఆయన మిత్ర బృందం నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన ఆర్థిక సహాయం గురించి వసుధా ఫౌండేషన్ దృష్టికి తీసుకువెళ్లి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. ఇందుకు బీసీ రాజారెడ్డి టంగుటూరి శీనయ్యను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కాసుల జంగంశెట్టి, భరతుడు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు మల్లారెడ్డి, నాగరాజు, కృష్ణనాయక్, నరసింహారెడ్డి, యనకండ్ల ఖాదర్, నాగిరెడ్డి, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్దలతో వరలక్ష్మివ్రత పూజలు

**– మద్దిలేటిస్వామిలో వరలక్ష్మివ్రతం ప్రాధాన్యత తగ్గడం పై భక్తుల అసహనం**





**బేతంచెర్ల, ఆగస్టు25, ప్రభాతవార్త:** మహిళలు వరలక్ష్మివ్రతాన్ని శుక్రవారం భక్తిశ్రద్దల నడుమ అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహస్వామి ఆలయంలో జరిగే ఉత్సవాల్లో ప్రాధాన్యత కలిగిన ఉత్సవంగా నిర్వహించే వరలక్ష్మివ్రతాన్ని కేవలం దేవస్థానం, ధర్మకర్తలకు మాత్రమే పరిమితం చేయడం పట్ల పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ ఆలయాల్లో వరలక్ష్మివ్రతాన్ని నిర్వహించడం జరిగింది. పలువురు మహిళలు సామూహిక వరలక్ష్మివ్రతానికి హాజరై వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి పూజలు నిర్వహించారు. మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ దంపతులు, ధర్మకర్తలు ఈవో పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వరలక్ష్మి వ్రత పూజలను చేయడం జరిగింది. వరలక్ష్మివ్రత పూజల కోసం ప్రతి ఏడాది దేవాదాయశాఖ మండలంతోపాటు ఇతర ప్రాంతాల భక్తులకు వివిధ ప్రసారమాధ్యమాలతోపాటు కరపత్రాల ద్వారా సమాచారాన్ని ఇచ్చి అత్యంత వైభవంగా వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తుంది. అయితే కేవలం రెండు, మూడు గ్రామాలకు తెలిసీ తెలియక వరలక్ష్మివ్రత పూజలను దేవస్థానంలో నిర్వహించడం పై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాబోవు కాలంలోనైనా వరలక్ష్మివ్రతాన్ని మునుపటిలాగానే వైభవంగా స్వామివారి సన్నిధి నందు నిర్వహించాలని భక్తులకు ఆ సదవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు. పలు పాఠశాలల్లోను వరలక్ష్మివ్రత పూజలను నిర్వహించారు.

## సిపిఐ ప్రచారజాత-బస్సు యాత్రను జయప్రదం చేయాలి

**ఆస్పరి, ఆగస్టు 25, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన ఆస్పరిలో స్థానిక సిపిఐ కార్యాలయంలో సెప్టెంబరు 2వ తేదీన ఆలూరులో సిపిఐ ప్రచార జాత-బస్సుయాత్రను జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, జిల్లా సమితి సభ్యులు నాగేంద్రయ్యలు మాట్లాడుతూ వేదావతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేసి ఆలూరు నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించాలన్నారు. అలాగే ఆస్పరి మండలాన్ని ప్రాజెక్టు పరిధిలోకి చేర్చి మండలంలోని అన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందించాలన్నారు. రాష్ట్రాన్ని రక్షించండి..దేశాన్ని కాపాడండి..అనే నినాదంతో ఆగస్టు 17న విశాఖలో ప్రారంభమైన సిపిఐ బస్సుయాత్ర సెప్టెంబరు 2న ఆలూరుకు వస్తుందన్నారు. ఆలూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికై సెప్టెంబరు 2న ఉదయం 11గంటలకు ఆలూరులో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని కార్యకర్తలు, సానుభూతి పరులు, రైతులు, విద్యార్థులు, మేధావులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు ఉరుకుందప్ప, రంగన్న, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎంప్లాయిస్ హెల్త్ స్కీంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**– కార్పొరేట్ ఆస్పత్రుల్లో అన్ని రకాల జబ్బులకు వైద్యం అందించాలి : స్టీరింగ్ కమిటీ సభ్యులు**

**నంద్యాల విద్య, ఆగస్టు 25, ప్రభాతవార్తః** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల హెల్త్‌స్కీంలో మెరుగైన సౌకరా ్యలు కల్పించాలని ఈహెచ్ఎస్ స్టీరింగ్‌కమిటీ సభ్యులు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానిసమూన్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లాలోని ఈహెచ్ఎస్ ఆస్పత్రుల జాబితా, వాటిలో లభించే వైద్యసౌకర్యం వివరాలు తెలియజేయాలని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అన్నిరకాల జబ్బులకు వైద్యం అందించాలని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలనందు సాయంకాలం సమయంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ఓపీ ఏర్పాటుచేసి సక్రమంగా అమలు అయ్యేటట్లు చూడాలని కోరారు. హైదరాబాదు, బెంగుళూరు నగరాల వంటి కార్పొరేట్ ఆస్పత్రులల్లో ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని, రాష్ట్ర, జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులను తక్షణం చెల్లించాలని, ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్ ్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఈహెచ్ఎస్‌నంద్యాల జిల్లా కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్‌రెడ్డి, ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షులు అజాంబేగ్, జిల్లా నాయకులు నాగేశ్వర నాయక్, ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు మాధవస్వామి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల పార్కింగ్‌కు ప్రధాన కాల్వపై బెడ్డు వేసిన ఘనుడు

**– కాల్వలు ఆక్రమించినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు**

నంద్యాల టెక్కె, ఆగస్టు 25, ప్రభాతవార్తః నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు తాయిళాలు ఇస్తే కాల్వలు ఆక్రమించినా, కట్టడాలు కట్టినా పట్టించుకోరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో ఆక్రమణలపై ఏసీబీ, విజిలెన్స్, జిల్లా కలెక్టర్ అధికారులు దాడులు జరిపినా, పలు ఆక్రమణలు గుర్తించినా ఎలాంటి చర్యలు లేకపోవడం విశేషం. మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న కాల్వపై వాహనాల పార్కింగ్ కోసం బెడ్డు వేయడం అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలు తావిస్తోంది. అధికారులకు తాయిలాలు అందాయన్న ఆరోపణలతో ఇటువైపు తొంగిచూడడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. సందుగొందుల్లో కాకుండా ప్రధాన రహదారి కాల్వపైనే బెడ్డు వేయడం విశేషం. అధికారులు ఈసంఘటనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిన అవసరం ఉంది. దీనిపై కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఓటరు వెరిఫికేషన్ గడువు పెంచండి

**– వైసీపీ నాయకులు**

**నంద్యాల టెక్కె, ఆగస్టు 25, ప్రభాతవార్తః** నందా ్యల జిల్లాలో ఓటరు సర్వే డోర్‌టూడోర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని మరో రెండునెలలు గడువు పొడిగించాలని వైసీపీ నాయకులు అనిల్ అమృత్‌రాజు, సన్నాల సాయిరాంరెడ్డి డీఆర్ఓ పుల్లయ్యను కోరారు. వారు వినతిపత్రం ఇస్తూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన గడువు పూర్తయిందని వివిధ కారణాల రీత్యా పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ జరగలేదని ఖచ్చితమైన ఓటర్ల జాబితా కావాలంటే మరికొంత సమయం ఇవ్వాలని వారు కోరారు. డీఆర్ఓ పుల్లయ్య వినతిపత్రంపై స్పందిస్తూ జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్ ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘానికి విన్నవిస్తామని ఆయన పేర్కొన్నారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌ను పరిశీలించిన డీపీఓ

**గడివేముల, ఆగస్టు25, ప్రభాతవార్త ;** మండలంలోని మంచాలకట్ట, చిందుకూరు ఎస్‌డబ్ల్యూఎం షెడ్‌లను శుక్రవారం డీపీఓ మంజులవాణి పరిశీలించారు. మంచాలకట్ట, చిందుకూరు ఎస్‌డబ్ల్యూఎం (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్) షెడ్‌ల గురించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా గడిగరేవుల, చిందుకూరు సచివాలయాలను సందర్శించి పంచాయతీ కార్యదర్శులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. స్పందన, నీటి ట్యాంకుల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీరు, గ్రామ పంచాయతీలకు డిజిటల్ పేమెంట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే క్లాప్‌మిత్రులకు జీతాలు చెల్లించాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కాలిక్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**– టీడీపీ మండల కన్వీనర్ యల్ల నాగయ్య**

**బేతంచెర్ల, ఆగస్టు25, ప్రభాతవార్త:** రాష్ట్రాభివృద్ధి టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని టీడీపీ మండల కన్వీనర్ యల్ల నాగయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్ బుక్కాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మిని మేనిఫెస్టోలో ఉన్న అంశాలను ఇంటింటికి వెళ్లి వివరించడం జరిగింది. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతున్నా ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, అలాగే 18 సంవత్సరాలు నిండిన ఆడబిడ్డకు నెలకు రూ.1500లు, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. వీటితోపాటు యువత, రైతు, కార్మికులకు సంబంధించిన పథకాలను అమలు చేస్తామని అందుకు టీడీపీకి పట్టం కట్టాలని ఆయన కోరారు. ఆయనతోపాటు బుక్కాపురం లక్ష్మన్న, జిల్లా ఎస్సీసెల్ అధికార ప్రతినిధి రూబెన్, కౌన్సిలర్ రామాంజనేయులు, పట్టణ బీసీసెల్ అధ్యక్షులు టైలర్ రాముడు, మాజీ ఎంపిటిసి జాకీరుల్లాబేగ్, బుగ్గానిపల్లె రమేష్, రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు ఫయాజ్, అంజి, మునేశ్వరరెడ్డి, గుడిసె మద్దిలేటి, నల్లారెడ్డి, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రయాన్ -2,3ల విజయంలో నంద్యాల జిల్లా వాసి పాత్ర

**నంద్యాల, విద్య, అగస్టు 25, ప్రభాతవార్త** ప్రపంచ దేశాలు గర్వించ దగ్గట్లు ఇండియా సాదించిన చంద్రయాన్ విజయంలో మన నంద్యాల జిల్లా వాసి డాక్టరు సలీంభాష పాత్ర కూడా ఎంతో ఉ ంది. డాక్టరు సలీంభాష నంద్యాల జిల్లా బేతంచెర్ల పట్టణములోని ముల్లమీరం సాహెబ్ మరియు వాహిదా దంపతులకు జన్మించాడు, ఈయన ప్రాదమిక విద్య బేతంచెర్ల మండలంలోని శేషారెడ్డి గవర్నమెంటు హైస్కూలు పూర్తి చేశారు. అనంతరము జేఎయన్‌టి హైదరాబాద్ విశ్వవిద్యాలయం బిటెక్ మెకానిక్‌ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరము ఇండియాన్ ఇన్సట్యూట్ అఫ్ సైన్సు బెంగుళూరులో పిహెచ్‌డి డాక్టరేట్ పొందారు డాక్టరు సలీం భాష లీడ సైంటిస్ట్‌గా 2006నుండి ఇస్రోలో కొనసాగు తున్నారు. ఎన్నో ఇస్రో మిషన్స్‌లో పాత్ర పోషించిన సలీం భాష చంద్రయాన్2మరియు చంద్రయాన్ 3 లో దర్మల్ డిజైనింగ్ లో లీడ్ సైంటిస్ట్‌గా పాత్ర పోషించారు. ఈయన నంద్యాల జిల్లా వాసి అనయినందుకునంద్యాల పురప్రముఖులు అబినందనలు తెలిపారు.

## టిడిపి అధికారంలోకి వస్తే రైతులకు విద్యుత్ కోతలు ఉండవు

**: మాజీ ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో తెలుగుతమ్ముల ధర్నా**

**: అధిక సంఖ్యలో తరలి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు**

**ఆత్మకూరు ఆగస్టు25, ప్రభాతవార్త:** ఖరీఫ్ సిజన్‌లో సాగు చేసుకుంటున్న రైతన్నలకు విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చోరవ తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దులాపురం బాష, మైనార్టీ సెల్ నాయకులు కలిముల్లా, తెలుగుయువత విభాగం నాయకులు సతీష్‌బాబు, మండల అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకులు నాగూర్‌ఖాన్, సీనియర్ నాయకులు రాంమూర్తిలు శుక్రవారం పట్టణంలోని కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం టిడిపి పార్టీ ఇంచార్జీ మాజీ ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో ఆప్రకటిత విదు ్యత్ కోతలను నిరశిస్తు కార్యక్రమాని కొనసాగించామన్నారు. రాబోయో ఎన్నికలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు లేకుండా చోరవ తీసుకుంటామని తెలిపారు. మండలంలో వర్షాబావ పరస్థితులో పంటలు ఎండి పోతున్నాయని, బోర్లు, బావులు ద్వార సరైన విద్యుత్ సరఫరా లేక రైతన్నలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోని రైతుల పక్షాన నిలబది ధర్నా చేయడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ నాయకులు అగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ధర్నాతో విద్యుత్ శాఖ అధికారులు పగటిపూట రైతులకు విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతుల పక్షాన అండగా నిలచిన మాజీ ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి, విద్యుత్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ రవింద్రబాబు, చిన్న, నాగేశ్వరనాయక్, శివశంకర్‌శర్మ, నబి, షఫివుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆర్థర్‌కు కృతజ్ఞతలు

**నందికొట్కూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:** తొగటవీర క్షత్రియ స్మశాన వాటికలో అడిగిన వెంటనే బోరుబావి వేయించిన నియోజకవర్గం ఎమ్మెల్యే తొగటవీర క్షత్రియ కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ చౌడేశ్వరీ దేవాలయ అభివృద్ధి కమిటీ నాయకులు దేశెట్టి శ్రీనువాసులు, కొప్పుల సత్యనారాయణ, కొముట్ల రవీంద్రాబాబు, కౌన్సిలర్ దేశెట్టి సుమలత మాట్లాడుతు స్మశాన వాటికలో బోరుబావి లేక ఇబ్బందులు పడ్డామని ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం అయిందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి పూజారిబాబు, సభ్యులు జల్లు రామచంద్రుడు, వెంకటేష్, జల్లు శేషయ్య, బాలు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్ రెస్టారెంట్‌ను ప్రారంభించిన అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు

**నంద్యాల రూరల్, ఆగష్టు 25, ప్రభాతవార్తః** నంద్యాల పట్టణంలోని స్థానిక అయ్యలూరు చెక్‌పోస్టు వద్ద వీఎస్ ప్యామిలీ రెస్టారెంట్‌ను నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ జి.వెంకటరాముడు శు క్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోనే అద్భుతమైన వంటకాలతో రుచికరమైన, పరిశుభ్రమైన, శ్రేష్ఠమైన శాఖాహార, మాంసాహారంతో కుటుంబసమేతంగా ఆరగించేందుకు పెద్దపెద్ద పట్టణాలకు ధీటుగా ఇంటి వంటకాలను మైమరిపించే ప్రత్యేకమైన వంటకాలతో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వీఎస్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను తీర్చిదిద్దారన్నారు. ప్రతి కుటుంబం ఇష్టపడే రీతిలో నంద్యాల ప్రజలకు ఆహ్వానం పలుకుతూ తింటే రుచికరమైన, పరిశుభ్రమైన, శ్రేష్ఠమైన వంటకాలను పరిచయం చేసేందుకు వీఎస్ రెస్టారెంట్‌ను సందరి ్శంచాలని యజమానులు ప్రత్యేకంగా ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు.

## తాగునీటి సమస్య రాకుండ చర్యలు చేపట్టాలి

**ఆదోని రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త**

పట్టణంలో తాగునీటి సమస్య రాకుండ చర్యలు చేపట్టాలని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆదోని జిల్లా సమితి ఆద్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, నిర్లక్ష్యంతో కట్టబడిన బసాపురం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాలన వైఫల్యానికి నిదర్శనమన్నారు. సరైన ప్రణాళికతో నిర్మించకపోవడంతో ట్యాంకు ప్రమాద స్థితికి చేరుకుందని ఇలాగే వదిలేస్తే కట్ట తెగి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కూడా అంతమయ్యే ప్రమాదం పొంచిఉందన్నారు. ఎమ్మెల్యే సాయి చేసిన అతిపెద్ద పని బసాపురం ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణమని కానీ ఎమ్మెల్యే అతిపెద్ద వైఫల్యం కూడా బసాపురం ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం నాసిరకం పనుల వల్ల శిథిలావస్థకు గురికావడమన్నారు. మరోపక్క వందల ఏళ్ల నాటి రాంజల చెరువు నీరు నిండుగా ఉన్నా ఆ నీరు తాగడానికి పనికిరావని మున్సిపల్ చైర్మన్ చెప్పడం మున్సిపల్ అధికారులు, పాలకుల వైఫల్యమే తప్ప మరొకటి కాదన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కళ్లు తెరిచి బసాపురం ఎస్ఎస్ ట్యాంకును యుద్ధ ప్రాతిపదికన రాతిగోడలతో పటిష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కుబేరస్వామి, వసీమ్‌సాహెబ్, నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బస్సు యాత్రను విజయవంతం చేయాలి

**దేవనకొండ, ఆగస్టు 25, ప్రభాతవార్త**

రాష్ట్రాన్ని రక్షించండి..దేశాన్ని కాపాడండి..అనే నినాదంతో సిపిఐ ఆద్వర్యంలో జరుగుతున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలని, ఆలూరులో సెప్టెంబరు 2న ఉదయం 11గంటలకు స్థానిక పాతబస్టాండ్ నందు భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రమైన దేవనకొండలో స్థానిక సిపిఐ కార్యాలయం నందు గోడపత్రికలు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె మద్దిలేటిశెట్టి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎం నరసరావు, పట్టణ సహాయ కార్యదర్శి రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ మండల సమితి సభ్యుడు సురేంద్ర, రైతుసంఘం మండల సీనియర్ నాయకుడు తిమ్మప్ప, సిపిఐ నాయకులు నరసింహులు, ప్రసాద్, రశీద్, కోదండ, రాజన్న, భాష, యువజన సంఘం నాయకులు రామాంజి, సూరి, విజయ్, సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

**హాలహర్వి, ఆగస్టు 25, ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని హాలహర్వి పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ ఆదినారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక పిహెచ్‌సిలో సీజనల్ వ్యాధుల పట్ల ఆశా, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పారిశుద్ధ్యలోపం వల్ల డెంగ్యూ, మలేరియా తదితర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరాలతో భాదపడుతున్న వారిని వెంటనే ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందించాలన్నారు. ముఖ్యంగా తాగునీరు కాచి వడబోసి తాగాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు నెలసరి టీకాలు తప్పనిసరిగా వేయాలని ఏఎన్ఎంలకు ఆదేశించారు. గర్భిణులు అంగన్‌వాడి కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారం తప్పక తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో గర్భిణుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏఎన్ఎంలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్దమ్మకుంటకు జలకళ

**మద్దికెర, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలో హంద్రీనీవా నుండి మద్దమ్మకుంటలోకి శుక్రవారం నీరు విడుదల చేయడంతో మద్దమ్మకుంట జలకళ సంతరించుకుంది. ముందుగా జడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి, ఎంపిపి అనిత యాదవ్, సర్పంచ్ బండారు సుహాసినితో పాటు వైసిపి నాయకులు, అధికారులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కుంట జలకళతో ఉంటే గ్రామంలోని భూగర్భ జలాలు జలంతో నిండి ఉండడంతో ప్రజలకు నీటికొరత లేకుండా ఉంటుందన్నారు. వైసిపి పార్టీ గ్రామానికి ఇచ్చిన మాట నిలబెట్టుకుని మద్దమ్మకుంటకు నీరుతెచ్చిన ఘనత వైసిపి పార్టీదేనన్నారు. మండలంలో ఏ పార్టీ హయాంలో జరగని విధంగా అభివృద్ధి చేసి చూపించడం జరిగింది. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల ముందుకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, పంచాయతీ పాలక మండల సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాలకుల విధానాలు ప్రమాదకరం : రామచంద్రయ్య

**పత్తికొండ, ఆగస్టు 25, ప్రభాతవార్త**

కేంద్రంలో నరేంద్రమోడీ, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డిలు అనుసరిస్తున్న విధానాలు ప్రమాదకరంగా ఉన్నాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య పేర్కొన్నారు. మండలంలోని దూదేకొండ గ్రామంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సిపిఐ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్‌లు ప్రజల బాగోగులను ఏ మాత్రం పట్టించుకోకుండ పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య మానవులు కొనలేని విధంగా పెంచేశారన్నారు. మోడీ అధికారంలోకి రాకముందు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని అధికారం చేపట్టి 9ఏళ్ల అయినా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో జగన్ పాలన అస్థవ్యస్తంగా తయారైందన్నారు. అభివృద్ధిని పట్టించుకోకుండ మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను తూ.చ తప్పకుండ పాటిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని రక్షించుకుందాం-దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సిపిఐ చేపట్టిన బస్సుయాత్ర బహిరంగ సభ సెప్టెంబరు 2న పత్తికొండలో పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతుందని ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సిపిఐ శాఖ కార్యదర్శి రాముడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండల కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు కారన్న, కృష్ణయ్య, పెద్దఈరన్న, ఆంజనేయ, సంజప్ప, సోమశేఖర్, పులికొండ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## స్పందన కార్యక్రమంపై ఆడిట్‌టీం సమావేశం

**పగిడ్యాల, ఆగస్టు 25, ప్రభాతవార్త**

పగిడ్యాల మండలం యందు నిర్వహించిన స్పందన కార్యక్రమం ఆడిట్ టీం అధ్వర్యంలో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి, అధికారి బివి.రమణ, మండల విస్తరణాధికారి బిఎల్.నాగేంద్రయ్య, డిప్యూటీ తహశీల్దార్ మురళీమోహన్, ఎస్ఐ నాగార్జున, మండల విద్యాశాఖాధికారి సుభాన్, వైద్యాధికారి డాక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నాయకుడు నౌనప్ప మృతి పార్టీకి తీరనిలోటు

**ఆదోని రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త**

మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు కురువ నౌనప్ప మృతి పార్టీకి తీరనిలోటు అని తెదేపా బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు అన్నారు. శుక్రవారం ఉదయం కురువ నౌనప్ప స్వగృహం వద్ద ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి, శ్రద్ధాంజలి ఘటించి తీవ్ర సంతాపం వ్యక్త పరిచారు. కురువ నౌనప్ప కుమారుడు, నారాయణపురం మాజీ సర్పంచ్ కారుమంచప్పకి ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈయన వెంట టిడిపి నాయకులు వడ్డెమాను గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, సాదిక్‌వలి, గిరిధర్, భారతి, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## రైతు సుధాకర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

**తుగ్గలి, ఆగస్టు 25, ప్రభాతవార్త**

మండల పరిధిలోని కొత్తపల్లె గుడిసెల గ్రామంలో గిరిజన రైతు సుధాకర్ మల్బరీ షెడ్డును గుర్తుతెలియని వ్యక్తులు తగలపెట్టడంతో సుమారు రూ.15లక్షల దాక ఆస్తినష్టం జరిగిందని ఆ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొత్తపల్లె గుడిసెలకు చెందిన గిరిజన రైతు సుధాకర్ తమ తోటలో ఉన్న మల్బరీ షెడ్డు, ఇతరిత్ర సామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో తీవ్రంగా ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. దీంతో రైతు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## రెండు ద్విచక్ర వాహనాలు చోరీ

**తుగ్గలి, ఆగస్టు 25, ప్రభాతవార్త**

మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలో గురువారం రాత్రి చాకలి రామచంద్రకు చెందిన స్ప్లెండర్ ప్లస్, కెవి వెంకటేష్‌కు చెందిన పల్సర్ బైక్‌లు చోరీకి గురయ్యాయి. గురువారం రాత్రి వారు తమ ఇంటి వద్ద బైకులను పార్కింగ్ చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం చూసేసరికి బైకులు కనిపించడం లేదన్నారు. ఒకేరోజు రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడం కలకలం రేపింది. గ్రామంలో రెండు ద్విచక్ర వాహనాలు పోవడంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. భాదితులు జొన్నగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు.

## గ్రామదేవతకు స్వాగతం..సుస్వాగతం..!

**మద్దికెర, ఆగస్టు 25, ప్రభాతవార్త**



మద్దికెర మద్దమాంబ గ్రామదేవతకు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా నల్లరేగడి పొలాల్లో కొలువైన అమ్మవారి పాదాల దగ్గర పూజారులు గ్రామప్రజలు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి అక్కడి నుండి అమ్మవారిని గ్రామంలోకి పిలుచుకుని రావడం జరిగింది. గ్రామంలో వివిధ పురవీధుల నందు డప్పు వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగించడం జరిగింది. గ్రామదేవతలను చూడడానికి గ్రామంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తుగ్గలి మోహన్‌రెడ్డి



**తుగ్గలి, ఆగస్టు 25, ప్రభాతవార్త :** పత్తికొండ మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి మనవడు వైసిపి సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుగ్గలి మోహన్‌రెడ్డిని వైఎస్సార్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమిస్తూ వైసిపి పార్టీ కేంద్ర కార్యాలయం నుండి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్బంగా వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో తనకు పదవి ఇచ్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. మోహన్‌రెడ్డికి పదవి రావడం పట్ల మండలంలోని పలువురు వైసిపి నాయకులు, అభిమానులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

## వేదావతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి సాగు, తాగునీరు ఇవ్వాలి



**హొళగుంద, ఆగస్టు 25, ప్రభాతవార్త :** వేదావతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి మారెప్ప అన్నారు. ఆలూరులో జరుగుతున్న వేదావతి గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని శుక్రవారం మండల పరిధిలోని కోగిలతోట, ముద్దటమాగి, చిన్నహ్యాట, బిజి హళ్లి గ్రామాల్లో ప్రజలను కలిసి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని కాపాడండి..రాష్ట్రాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ రాష్ట్ర బస్సు యాత్ర సెప్టెంబరు 2న ఆలూరులోకి ప్రవేశిస్తుందని ఆలూరులో జరుగు వేదావతి నదిగర్జన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వేదావతి ప్రాజెక్టు పరిధిలోకి ఆస్పరి మండలాన్ని చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కృష్ణయ్య, అసేన్ భాష, ఇబ్రహీం, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ప్రచార బస్సు యాత్ర జయప్రదం చేయండి



**నందికొట్కూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి దేశాన్ని కాపాడాలని సిపిఐ చేపట్టిన ప్రచార బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు పిలుపు నిచ్చారు. ఈ నెల 17వ తేదీన విశాఖపట్టణంలో ప్రారంభమైన సిపిఐ ప్రచార బస్సు యాత్ర వచ్చే నెల 1వ తేదీన నంద్యాల పట్టణానికి చేరుకుంటుందని నంద్యాలలో రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు నిర్వహిస్తున్నారని అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని కావున అందరు పాల్గొని జయ ప్రదం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. అందులో బాగంగా శుక్రవారం పట్టణంలో బైక్ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రమేష్‌బాబు, వి.రఘురాంమూర్తి, రాముడు, నాగస్వాములు, ఏఐటియుసీ, ఎస్.ఎఫ్.ఐ.నాయకులు పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

:- జనసేన పార్టీ మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జ్ వాల్మీకి లక్ష్మన్న



**పెద్దకడుబూరు రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** జనసేన కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని జనసేన పార్టీ మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జ వాల్మీకి లక్ష్మన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బసలదొడ్డి గ్రామంలో మండల నాయకులు రాజు, సుభాన్‌ల ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంచార్జ లక్ష్మన్న కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ జనసేన కార్యకర్తలు అందరు ఐక్యమత్యంతో కలిసి సైనికుల్లా పనిచేసి పార్టీని బలపరచాలని అన్నారు. 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుపు ఖాయమని తెలిపారు. మంత్రాలయంం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి జనసైనికులను చైతన్య పరచి జనసేన పార్టీని నియోజకవర్గంలో పటిష్ట పరుస్తానని ఆయన తెలిపారు. అలాగే కోసిగి, కౌతాళం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో పర్యటించి జనసైనికులను చైతన్య పరచడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పెద్దకడుబూరు మండలంలోని బసలదొడ్డి గ్రామంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మల్లికార్జున, రాఘవరెడ్డి, నరేష్, భాష, జమీరు, రామకృష్ణ, నవీన్, వీరేష్, జనసైనికులు పాల్గొన్నారు.

## వర్షం కోసం 108బిందెలతో జలాభిషేకం



**ఆస్పరి, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆస్పరి సమీపాన రామతీర్థం కొండల్లో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో వర్షం కోసం శంకరబండ గ్రామానికి చెందిన మహిళలు కళశాలతో 108బిందెలతో ఊరేగింపుగా వచ్చి గాయత్రీమాతకు జలాభిషేకం నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయ ప్రధాన నిర్వాహకుడు రూపామోహన్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు కాశీవిశ్వనాథ్ గాయత్రీమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, గాయత్రీహోమం, మహామంగళారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని వరలక్ష్మీ ప్రతిమను తయారు చేసి వరలక్ష్మీ వ్రతానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు హనుమేష్ ఆచారి వరలక్ష్మీ కథను భక్తులకు వినిపించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర ఉమాదేవి, శంకరబండ సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపిపి భర్త రామాంజనేయులు, వైసిపి కోకన్వీనర్ పురుషోత్తమ్‌రెడ్డి, ముత్యాల రెడ్డి, నాగేంద్రరెడ్డి, గుర్రప్ప, నారాయణరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చెంచుగూడెం సందర్శన



**చాగలమర్రి, ఆగస్టు25, ప్రభాతవార్త:** మండలంలోని డీవనిపెంట పంచాయతీ పరిధిలో ఉన్న చెంచుగూడెన్ని, చాగలమర్రిలో పట్టణంలోని చాగలమ్మ చెంచుకాలనీని ఎంపిడివో మహబూబ్ దౌలా శుక్రవారం సందర్శించారు. చెంచుకాలనీలో పరిస్థితి, చెంచుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు, తదితర వాటి పై వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలిం చారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ సుదర్శన్‌రావు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ప్రతి పశువుకు ముద్దచర్మవ్యాధి టీకాను వేయించాలి



**గోనెగండ్ల ఆగస్టు 25 ప్రభాతవార్త :** ప్రతి పశువుకు ముద్దచర్మవ్యాధి(లంపి) రాకుండా ముందు జా గ్రత్తగా పశువుల యాజమానులు తమ పశువులకు ముద్ద చర్మవ్యాధి టీకాలను వేయించాలని పశువైద్యాధికారి మహమ్మద్ ఆలి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ముద్దచర్మవ్యాధి సోకకమందే ప్రతి పశువులకు పశువు యాజమాని ఖచ్చితంగా టీకాలను వేయించాలని కోరారు. ఈ నెలలో ముద్దచర్మవ్యాధి టీకాలను గంజహళ్ళి, బైలుప్పల, అగ్రహారం, విరంపల్లి, బోదేపాడు, హెచ్ కైరవాడి తిప్పనూరు, గ్రామలలో వేశారని తెలిపారు. మిగిలిన గ్రామాలలోని రైతులు తమ పశువులను టీకాలను వేయించాలని ఆయన కోరారు. దాదాపు అని గ్రామలలోని పశువులకు వ్యాధి అందుపులోకి వచ్చిందని అన్నారు. రైతులు కొత్త పశువులను కొనుగోలు చేసిన వెంటనే తప్పకుండా టీకాలు వేయించాలని తెలిపారు. ఒక సారి టీకా వేయించిన తర్వత ఒక సంవత్సరం వరకు వేయలసిన అవసరం రాదు అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేయడంలో కిడ్డీస్ స్కూల్ టాప్



**ఆదోని రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త**

పట్టణంలోని కిడ్డీస్ స్కూల్ అధిక ఫీజులు వసూలు చేయడంలో టాప్‌లో ఉందని రాయలసీమ ఐక్య విద్యార్థి ఫెడరేషన్(ఆర్‌యుఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్షులు రఘునాథ్, వంశీలు మండిపడ్డారు. శుక్రవారం ఆర్‌యుఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నియమాలు తుంగలో తొక్కి విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేయడంలో కిడ్డీస్ స్కూల్ యాజమాన్యం నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. పట్టణంలో ఏ ప్రైవేటు స్కూల్ వసూలు చేయని ఫీజు ఒక్క కిడ్డీస్ స్కూల్ మాత్రమే వసూలు చేసి విద్యార్థి తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారన్నారు. అలాగే బుక్స్, యూనిఫాం పేరుతో అధికంగా వసూలు చేయడం జరుగుతుందని కిడ్డీస్ స్కూల్‌లో ఇంత ఫీజుల దందా జరుగుతున్నా విద్యాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కిడ్డీస్ స్కూల్ యాజమాన్యంపై ప్రభుత్వ విద్యాధికారులకు విద్యార్థి సంఘాలు అనేకమార్లు వినతిపత్రాలు సమర్పించినా అధికారులకు ఏమాత్రం లెక్కలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్య అధికారులు మేల్కొని కిడ్డీస్ స్కూల్ ఫీజుల దోపిడీని అరికట్టి పేద విద్యార్థులు చదువుకోవడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఉండాలి

**హాలహర్వి, ఆగస్టు 25, ప్రభాతవార్త :** రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఏఓ శివశంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన హాలహర్విలో రైతుభరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని రైతుభరోసా కేంద్రంలో రైతులకు ఎరువులు, విత్తనాలు, తదితర వ్యవసాయ పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఆదేశించారు. ఖరీఫ్‌లో వరి, మిరప, పత్తి, వేరుశనగ తదితర పంటలు రైతులు సాగు చేశారని తెలిపారు. పంటల తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పిచికారి చేయాల్సిన మందులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాకుండ రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈక్రాప్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, పంటనష్ట పరిహారం, పంటలభీమా అందుతాయన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఆర్‌బికెల్లో రైతులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే అగ్రికల్చర్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## 27న శ్రీ పెద్దమ్మ అవ్వ 13వ వార్షికోత్సవ ఉత్సవాలు



పత్తికొండ, ఆగస్టు 25, ప్రభాతవార్త

పట్టణంలోని ఉప్పరవారి కట్ట దగ్గర వెలసిన శ్రీశ్రీ పెద్దమ్మ అవ్వ 13వ వార్షికోత్సవ ఉత్సవాలు ఈ నెల 27న ఆదివారం నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు భాస్కర్, నరసింహమూర్తి, రవి, వెంకటేష్‌లు తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్బంగా 27న ఆదివారం ఉదయం శ్రీశ్రీ పెద్దమ్మ అవ్వకు గణపతి పూజ, పంచామృతా భిషేకాలు తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 1గంటకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వివరించారు. కావున భక్తులు ఈ పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## రూ.14కోట్లు బోనస్ పంపిణీ



**చాగలమర్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** విజయ డైరీ పరిధిలోని నాలుగు జిల్లాల్లో ఈ ఏడాది పాడి రైతులకు రూ.14కోట్లు బోనస్ పంపిణీ చేసినట్లు విజయడైరీ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తోడేళ్లపల్లె గ్రామంలో విజయడైరీ పాడి రైతులకు బోనస్ సబ్సిడీ ఎంపిపి రామిశెట్టి వీరభద్రుడు, డిప్యూటీ డైరెక్టర్ రాజేష్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా డైరెక్టర్ రాజేష్ మాట్లాడుతూ 2021లో ప్రతి లీటర్‌కు రూ.1 బోనస్ ఉండేదని ఈ ఏడాది డైరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి దానిని రూ.3లకు పెంచడం జరిగిందన్నారు. విజయడైరీకి పాలుపోసే రైతులు గేదెలు కొనుగోలు చేస్తే కొనుగోలు ధరలో 20శాతం సబ్సిడీ రూపంలో అందజేస్తామన్నారు. రైతులు పశుగ్రాసాన్ని సాగుచేస్తే ఎకరాకు రూ.5వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పాడి రైతుల ఇంట్లో వివాహ కార్యక్రమం ఉంటే కళ్యాణమస్తు కింద రూ.5వేలు, రైతు ప్రమాదవశాత్తూ మరణిస్తే క్షీరబంధు కింద రూ.50వేలు బీమా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాసులు, మేనేజర్ పద్మయ్య, సూపర్‌వైజర్ ఆనంద్, ఏజెంట్లు ఆలమూరు దస్తగిరి, పాడి రైతులు పాల్గొన్నారు.

## వర్ష కోసం ప్రార్ధనలు చేసిన ముస్లీం సోదరులు



**మిడుతూరు, ఆగస్టు25, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన మిడుతూరులోని ఈద్గా సమీపంలోని పొలంలో ముస్లీం సోదరులు శుక్రవారం వర్ష కోసం ప్రార్ధనలు చేశారు. ఈ యేడాది మొదటి నుంచి వర్షం కొరత ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు ఎన్నడూ లేనివిధంగా మొదటి నుంచి వైరస్ సోకి పంటలు చెడగొట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దానికి తోడు వర్షాలు పూర్తిస్థాయిలో రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ముస్లీం సోదరులు వర్షం రావడానికి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం ; కౌన్సిలర్



**ఆదోనిరీగల్, ఆగస్టు25, ప్రభాతవార్త ;** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని 36వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆ వార్డు పరిధిలోని ఎన్‌టీఆర్ కాలనీ, ఖాజీగడ్డ, బోయగేరి ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ఖాజీగడ్డలో సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాంతాలవాసుల సమక్షంలోనే సమస్యల పరిష్కారానికి మార్గాలను ఆరా తీశారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, ఓవర్‌హెడ్ ట్యాంకు ఎప్పుడు సగం వరకే నిండుతుందని, ఫుల్‌గా నిండకపోవడం వల్లనీటి సమస్య ఏర్పడుతోందని కాలనీవాసులు కౌన్సిలర్ దృష్టికి తీసుకొచ్చారు. నీటి సమస్యపై ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డిలతో మాట్లాడి త్వరలోనే పరిష్కారం చేస్తామని ఫయాజ్ భరోసా ఇచ్చారు. రోడ్లు, సందుల్లో వీధిలైట్లు వెలగడంలేదని తెలపగా పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## పేదలకు సేవకుడు... ఆపదలో ఆపద్బాందవుడు..



**ఆత్మకూరు ఆగష్టు25, ప్రభాతవార్త:** పేద ప్రజలకు సేవకుడిగా ఉంటూ ఆపదలో ఉన్న వారికి ఆపద్బాందవుడులా ముందుకు వెల్తూ తన దగ్గర ఉన్న దానిలోనే ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్య సాధనతో సేవలు చేస్తున్న ఆకుల సలాం శుక్రవారం మండల పరిధిలోని కరివేన గ్రామంలో ఆనారోగ్యంతో భాదపడుతూ పేదరికంలో నలిగి పోతున్న పసివాడి ప్రాణానికి తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. సేవ చేసేందుకు ముందుకు వెల్లేది కొందరు అయితే అందరిలో మనము ఎందుకు మన దగ్గర ఉన్నదాని పేదలకు సహాయం చేయడం ముందుకు రావడం లేదు. అనే విషయాని అందరికి కనువిప్పుగా ఆకుల సలాం నిలిచ్చారు. పసివాడి ప్రాణానికి ఆర్థిక సహాయంను అందించాలనే ఆశయంతో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయాని తెలుసుకున్న ఆకుల సలాం తక్షణమే గ్రామానికి వెల్లి పసివాడి తల్లిదండ్రులకు ఆర్థిక సహాయంను అందించారు. వీరి వెంటా కరివేన గ్రామానికి చెందిన పాపయ్య, తదితరులు ఉన్నారు.

## అంకాళమ్మవారికి విశేష పూజలు

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు25, ప్రభాతవార్త :** లోక కల్యాణం కోసం శ్రీశైల క్షేత్ర గ్రామ దేవత అయిన శ్రీ అంకాళమ్మ వారికి శుక్రవారంనాడు ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మ వారికి దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) ఈ విశేష పూజ జరిపించబడింది. ఇందులో భాగంగా శ్రీ అంకాళమ్మ వారికి అభిషేకం, విశేష అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రదాన ఆలయానికి ఎదురుగాగల రహదారిని చివరలో కుడివైపు ఉత్తరముఖంగా ఉంది. చతుర్భుజాలు కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన ఢమురుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట ముకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గందోదకం, పుష్పోదకం, విశేషఅభిషేకం అర్చనను నిర్వహించబడ్డాయి.

## వరాల తల్లికి ప్రత్యేక పూజలు



**మద్దికెర, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు, గృహిణులు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం కావడంతో మహిళలు వరలక్ష్మీ వ్రతం చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపారు. మద్దమ్మ గుడి దగ్గర ఉన్న గోవింద్ గృహంలో వరలక్ష్మీ వ్రతాన్ని ప్రత్యేకంగా నిర్వహించి ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విధంగా ప్రతి ఏటా కొనసాగిస్తున్నామని గోవింద్ తెలిపారు.

## స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీగా పెరుమాళ్ళ శ్రీనాథ్



**నందికొట్కూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:** పట్టణంలోని బాలుర(కోట) జిల్లా పరిషత్ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పెరుమాళ్ళ శ్రీనాథ్ నంద్యాల జిల్లా నూతన స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14/17 (బాలబాలికల)సెక్రటరీగా నియమిస్తు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి ఆదేశాలు జారి చేశారు. ఈయన కర్నూలు జిల్లా శాప్-కోఆర్డీనేటర్‌గా పనిచేస్తున్నారు. అంతేకాక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ త్రివేండ్రంలో బాస్కెట్ బాల్ కోచ్ శిక్షణ పూర్తి చేశారు. పలు పర్యాయములు స్కూల్ గేమ్స్ జాతీయ జట్లకు మరియు ఖేలో ఇండియా ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ టీంకు మేనేజర్ వ్యవహారించారు. శ్రీనాథ్‌కు పలువురు అభినంధనలు తెలిపారు.

## 142జీఓను వెంటనే అమలు చేయాలి



**ఆలూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త :** ఏపి గ్రామ పంచాయతీ కార్మికుల 142వ జీఓను సక్రమంగా వెంటనే అమలు చేయాలని సిఐటియు నాయకులు కెపి నారాయణస్వామి, షాకీర్‌లు అన్నారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలిపి ఎంపిపి రంగమ్మకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్బంగా నాయకులు నారాయణస్వామి, షాకీర్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ చాలీచాలని వేతనాలతో కార్మికులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 142వ జీఓను అమలు చేసి రిటైర్‌మెంట్ బినిఫిట్, పెన్షన్ అందించాలన్నారు. 2022పిఆర్‌సి అమలు చేసి 1993నాటికి ఉన్న కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు 13నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తాలుక కార్యదర్శి ఎల్లప్ప, రాముడు, లక్ష్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ద కార్మీకులు బిక్షాటన



**కొత్తపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుద్ద కార్మీకులు 14 నెలలుగా జీతాలు రావడంలేదని మండల కేంద్రంలో జీవనానికి ఇబ్బంది కరంగా ఉందని బిక్షాటన చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపియం మండల నాయకులు ఎన్.స్వాములు, కార్మీక సంఘం మండల అధ్యక్షులు స్వాములు మాట్లాడుతు గ్రామీణ పారిశుద్ద కార్మీకులకు ప్రభుత్వం 14 నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని, ప్రభుత్వానికి కార్మీకుల ఆకలికేకలు వినకపోవడం దారుణమని, ఇప్పటికైన ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని, జీవో నెం. 680 ప్రకారం రూ.10వేలు జీతం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మీకులు మల్లేష్; రంగస్వామి, ఓబులయ్య, చెన్నయ్య, వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిసి హస్టల్ అకస్మికంగా తనికీ చేసిన బిసిడబ్యుఓ



**కోవెలకుంట్ల, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సంజామల ఉన్న బిసి హస్టల్‌ను డోన్ బిసి డబ్యుఓ నరసయ్య అకస్మికంగా తనికీ చేశారు. శుక్రవారము సాయంత్రము డోన్ బిసి డబ్యుఓ నరసయ్య సంజామలలోని బిసి హస్టల్‌ను చెక్ చేశారు ఈసందన్బముగా అక్కడ ఉన్న మెనుపై అరా తీశారు అలాగే విద్యార్ధులతో అయన మాట్లాడారు వారు ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పాడము సంతృప్తి వ్యక్తం చేశారు ఈకార్యక్రమంలో వార్డన్ మునిరాజు, టూటర్ శ్రీను సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రయాన్-3 నిర్మాణంలో బేతంచెర్లవాసి

- హర్షం వ్యక్తం చేసిన మండల ప్రజలు



**బేతంచెర్ల, ఆగస్టు25, ప్రభాతవార్త:** ప్రపంచానికి అంతరిక్ష పరిశోధనలో సత్తాచాటిన భారతదేశ ప్రయోగం చంద్రయాన్-3 రూపకల్పనలో బేతంచెర్లవాసి సైంటిస్ట్‌గా పనిచేయడం పట్ల శుక్రవారం మండల ప్రజలు అభినందనలతో పాటు హర్షం వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన ముల్ల మీరంసాహెబ్, వహీదాల కుమారుడైన డాక్టర్ సలీమ్ బాషా ఇస్రోలో లీడ్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన బేతంచెర్లలో ప్రాథమిక విద్యతోపాటు ఉన్నత విద్యను స్థానిక శేషారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు అభ్యసించారు. ఆ తరువాత హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పొందారు. ఆ తరువాత 2006 నుండి ఇస్రోలో డాక్టర్ సలీమ్ బాషా లీడ్ సైంటిస్ట్‌గా కొనసాగుతున్నారు. ఎన్నో ఇస్రో మిషన్లల్లో కీలకపాత్ర పోషించిన సలీమ్‌బాషా చంద్రయాన్-2 మరియు చంద్రయాన్-3లల్లో థర్మల్ డిజైనింగ్‌లో లీడ్ సైంటిస్ట్‌గా పనిచేశారని తెలియడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పలు సోషల్ మీడియా ద్వారా ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.

## సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన గుండం శేషిరెడ్డి



**బనగానపల్లె, ఆగస్టు25, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామం కొత్తపేట కాలనీలో గంగన్నబోయిన రంగమ్మ ఇంటి వద్ద నుండి గుండ్లశింగవరం వెంకటేశ్వర్లు ఇంటి వరకు గడప గడప నిధుల కింద సిమెంట్ రోడ్డు నిర్మాణం కొరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుండం శేషిరెడ్డి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా గుండం శేషిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధి చేస్తున్నారని ఆయన తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని తెలిపారు. నియోజక అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెలుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం వైసీపీ నాయకులు అల్లె సురేష్‌రెడ్డి, పలుకూరు సర్పంచ్ కోనేటి సుమలత, ఉపసర్పంచ్ శివకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దస్తగిరి, సచివాలయ కన్వీనర్ వడ్డె వెంకటేష్, సురేష్, జాను, సురేంద్ర గౌడ్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు25, ప్రభాతవార్త

లోక కల్యాణం కొసం దేవస్థానం సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్లకు దేవస్థానం ఊయల సేవ వైభవంగా నిర్వహించడం జరిగింది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలా నక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపి ంచబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహగణపతిపూజ జరిపించబడింది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడపచార పూజ జరిపించబడింది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడింది. ఊయలసేవను పురస్కరించుకోని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పలంకరణ, పుష్పార్చనలు జరిపించబడ్డాయి.

## వైకాపా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

:- మాజీ జడ్‌పిటిసి బొజ్జమ్మ, రామచంద్రనాయుడు



**ఆలూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త :** వైకాపా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆస్పరి మాజీ జడ్‌పిటిసి కప్పట్రాళ్ల బొజ్జమ్మ, రామచంద్రనాయుడులు అన్నారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో వెలసిన శ్రీ షేక్షావలి, షాషావలి దర్గాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుగు ప్రయాణంలో ఆలూరు పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో వైకాపా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రాణం ఉన్నంతవరకు పార్టీలో కొనసాగుతామన్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో తమ సేవలను గుర్తించలేదన్నారు. అభిమానులు, శ్రేయోభిలాషులు ,కార్యకర్తల అభీష్టం మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైకాపా పార్టీలో చేరి కండువా వేసుకున్నామన్నారు. వైకాపా పార్టీ అధిష్టానం ఆదేశిస్తే 2024ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆమె పేర్కొన్నారు.

## హంద్రీనీవా నీరు విడుదల



**దేవనకొండ, ఆగస్టు 25, ప్రభాతవార్త :** దేవనకొండ మండలానికి హంద్రీనీవా ద్వారా సాగునీటిని జడ్‌పిటిసి కిట్టు శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు ఎండిపోకుండ ఉండేందుకు హంద్రీనీవా నీటిని విడుదల చేసినట్లు తెలియజేశారు. కావున మండల రైతులు సాగునీటి వృధా చేయకుండ సమృద్ధిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నీలి రాజశేఖర్, వెలమకూరు రామచంద్ర, హరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న గౌరు దంపతులు



**గడివేముల, ఆగస్టు25, ప్రభాతవార్త ;** మండలంలోని కరిమద్దెల గ్రామంలో నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు కత్తి శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డిల ఆహ్వానం మేరకు గురువారంనాడు పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి హాజరయ్యారు. అనంతరం సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయిబాబా తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, సుభద్రమ్మ, వడ్డు లక్ష్మీదేవమ్మ, సీనియర్ నాయకుడు పంట రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, ఐటీడీపీ బీవీఎన్ రాజు, కాంతారెడ్డి, గణేష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జేఎస్‌డబ్ల్యూ ఆవరణలో ఎలుగుబంటి హల్‌చల్.

**గడివేముల, ఆగస్టు25, ప్రభాతవార్త ;** మండలంలోని బిలకలగూడూరు వద్ద ఉన్న జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో శుక్రవారం నాడు దారి తప్పి ఒక ఎలుగుబంటి ప్రవేశించడం జరిగింది. దీంతో యాజమాన్యం, సిబ్బంది అప్రమత్తమై ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది దాదాపు 40 మందితో ఎలుగుబంటిని బంధించడానికి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. వెలుగోడు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఎంఎఖానన్ ఆధ్వర్యంలో ఎలుగుబంటికి మత్తు ఇచ్చి బంధించి బోనులో తీసుకెళ్లారు. ఆరోగ్య పరీక్షలు చేశాక అడవిలో వదిలిపెడతామన్నారు. ఎలుగుబంటి యొక్క వయస్సు దాదాపు ఐదు సంవత్సరాలు ఉంటుందని అటవీశాఖ అధిఆరులు తెలిపారు.



## భూముల వివరాలు ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేయండి

### పవర్ పాయింట్ ద్వారా శిక్షణ ఇచ్చిన జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య...



**కర్నూలు, ఆగస్టు 25, ప్రభాతవార్త :** భూముల వివరాలు పక్కగా ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని జేసీ మౌర్య ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం డివిజన్ మరియు మండల రెవెన్యూ అధికారులతో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, ఇనాము భూముల, దేవాదాయ శాఖకు చెందిన మరియు ఇతర భూముల వివరాలు తప్పులు చేయకుండా పక్కగా ఆన్ లైన్ లో అప్లోడ్ చేయాలి అని అందుకు గాను పవర్ పాయింట్ ద్వారా అవసరమైన శిక్షణ ఇస్తూ తెలిపారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల అమలు నిమిత్తం వ్యవసాయ శాఖ వారు రైతులను గుర్తించారు. వాటి వివరాలను తాసిల్దారులకు ఇవ్వడం జరిగింది . తాహ్సిల్దారులు ఆ వివరాలు వెబ్ లాండ్ లో నమోదు చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్ ఆదేశించినారు. వ్యవసాయ శాఖ వారిని రైతుల పంటలను వెంటనే ఈ కేవైసీ చేయవలసిందిగా ఆదేశించారు. ప్రస్తుతము జరుగుతున్న ఆబాదీ సర్వే చాలా నెమ్మదిగా జరుగుతున్నది దానిని ఒక పద్ధతి ప్రకారం వేగం పెంచి త్వరగా సర్వే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించినారు. రాష్ట్ర ప్రభుత్వం చాలా సంవత్సరాల నుండి అర్హులైన నిరుపేదలకు భూములు పంచడం జరిగింది. ఆ భూములు ఇప్పుడు ఎవరు సాగు చేసుకుంటున్నారు. ఆ భూమి మీద ఎవరు ఉన్నారు ? అన్న వివరాలు సేకరించి ఆన్ లైన్లో అప్లోడ్ చేయవలసిందిగా ఆదేశించినారు. గ్రామాలలో ఎన్ని సర్వీస్ ఇనాములు ఉన్నాయి వాటిని సేకరించి వాటిని కూడా ఆన్లైన్లో అప్లోడ్ చేయవలసిందిగా ఆదేశించారు. ఈ సంవత్సరం క్రొత్తగా ల్యాండ్ అసైన్మెంట్ జరిగిన వారికి కూడా ఆన్ లైన్లో అప్లోడ్ చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ విషయంపై కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జాయింట్ కలెక్టర్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ నాగేశ్వర రావు, డి .పి. ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, ఏ.డి.సర్వే, ఆర్.డి.ఓ లు , తహశీల్దారులు , కలెక్టరేట్ ఏ.ఓ మరియు సంబంధిత అధికారులు , సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## అవినీతి ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు రాజ్యమేలుతున్నారు



**గోనెగండ్ల ఆగస్టు 25 ప్రభాతవార్త :** ఏపీలో అవినీతి ముఖ్యమంత్రి, అసమస్త ఎమ్మెల్యేలు రాజ్యమేలుతున్నారు అందుచేత రాష్ట్రం అభివృద్ధిలో వెనక పడిపోయిందని మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామాలలో పల్లెనిద్ర కార్యక్రమంలో బాగంగా ఆయన పర్యటించారు. ప్రజలతో సమావేశమయ్యారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు బీవీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను టీడీపీ పరిష్కరిస్తుందని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను గ్రామంలో ఎగురవేశారు. గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు చేసే అభివృద్ధి పనులను గురించి వివరించారు. గ్రామ ప్రధాన కూడళ్లలో ప్రజల నేద్దేశించి బీవీ ప్రసంగిస్తూ సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధిలో దేశంలోని అన్ని రాష్ట్రల కంటే వెనక పడిపోయిందని తెలిపారు. రాష్ట్రంకు కొత్తగా పరిశ్రమలు రాక పోగ ఉన్న పరిశ్రమలు కూడా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రలకు వలస పోతున్నాయని అన్నారు. రాష్ట్రంలో పాలన ఉన్నదా లేదా అనే విధంగా తయారైందని రైతులకు ఇంతవరకు ఏ లాంటి మేలు చేసే పని చేయలేదని వైసీపీ ప్రభుత్వం రైతు వ్యతిరేఖ ప్రభుత్వంగా మారిందన్నారు. ఇక 2024 ఎన్నికలలో వైసీపీ కి వ్యతిరేఖంగా ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. నిత్యవసర వస్తువులు పెట్రోల్, డీజిల్, ధరలు పెంచడమే గాక కరెంట్ బిల్లులు, బస్‌చార్జీ లు పెంచడం దారుణం అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్‌లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ. 1500, నిరుద్యోగులకు నెలకు రూ. 3000 వేలు, ప్రతి గ్రామనికి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని టీడీపీ హామీ ఇస్తుందని తెలిపారు. అనంతరం తిప్పనూరు గ్రామస్థులు దాదాపు 50 మంది టీడీపీ పార్టీలోకి చేరిన వారిని పార్టీ కండువా కప్పి అహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బీవీ జయనాగేశ్వరరెడ్డి. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధాన కార్యదిర్శ తిరుపతయ్యనాయుడు, ఎర్రబాడు మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, చిన్ననేలటూరు నాగన్న, కులుమాల రాముడు, రమేష్‌నాయుడు, ఫక్రుద్దిన్, తిప్పనూరు రాఘవేంద్ర, మునిస్వామి, రాంపురం రఫిక్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు..లోకేష్.. పవన్‌కళ్యాణ్‌లు ఎన్ని యాత్రలు చేసినా దండగ

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి



**నంద్యాల క్రైం, ఆగష్టు 25, ప్రభాతవార్తః** రాష్ట్రంలో చంద్రబాబు.. .లోకేష్.. యువగళం... పవన్‌కళ్యాణ్ వారావాహి యాత్రలు ఎన్ని యాత్రలు చేసినా కుటిల రాజకీయాలు, విషప్రచారాలు చేసినా రానున్న 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ జెండా ఎగురవేయడం ఖాయం ఇది తథ్యమని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నంద్యాల పట్టణం ప్రథమనందీశ్వరస్వామి దేవస్థానం ఆవరణంలో వైసీపీ పార్టీ సచివాలయ కన్వీనర్లతో సమావేశం అయ్యారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పీపీ.నాగిరెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నీసా, వైస్‌ఛైర్మెన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలిలు పాల్గొన్న సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీకి సచివాలయ కన్వీనర్లు వెన్నెముక లాంటివారని రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్కరు సమర్థవంతంగా పనిచేసి ప్రజల్లోకి వైసీపీపార్టీ చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నాలుగన్నర సంవత్సరాల అధికారంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నూటికి 90శాతం నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్ని విధాలా లబ్ధి చేకూర్చామన్నారు. అందుకే మిమ్ములను అడుగుతున్నా... దేవుడి దయ వల్ల ఎన్నికల్లో వైసీపీ పార్టీని అధిక మెజార్టీ, 175కు 175 సీట్లు రావడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి అదికారం చేపట్టిన కొద్దినెలలలోనే ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారితో ప్రజలు అల్లాడుతున్న తరుణంలో వైసీపీ పార్టీ అండగా నిలిచిందని గుర్తు చేశారు. అలాంటి విపత్కర పరిస్థితులల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు తోడుగా నిలిచారన్నారు. జేసీఎస్ నమోదు కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరు రూ. 10లక్షల భీమా చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది విజయశేఖర్‌రెడ్డి, వైసీపీ నాయకులు సాయిరాం రెడ్డి, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజు, బెస్తసంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, నంద్యాల ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ కౌన్సిలరు పున్నా శేషయ్య, సందీప్, కౌన్సిలరు చంద్రశేఖర్, యుగంధర్, దాల్‌మిల్ అమీర్, బసవేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరిదేవి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మివ్రతం



**బనగానపల్లె, ఆగస్టు25, ప్రభాతవార్త:** మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి దేవస్థానంలో వరలక్ష్మివ్రతం సందర్భంగా శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి గణపతిపూజ, అభిషేకం, ప్రత్యేక పూజలతోపాటు సామూహిక వరలక్ష్మివ్రత కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఈవో వివిఎన్ రామానుజన్ ఆధ్వర్యంలో గణపతి పూజా, పుణ్యాహ:వచనంతో ప్రారంభమైన సామూహిక వ్రతం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, సహస్ర సామూహిక కుంకుమార్చన, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు, సామూహిక వరలక్ష్మివ్రతాన్ని అత్యంత వైభవంగా జరిపారు. ఈ వ్రతంలో గ్రామానికి చెందిన మహిళలే కాకుండా తెలంగాణ, కర్నాటకలతోపాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి సుమారు 1500 మంది మహిళలు వ్రతంలో పాల్గొని పూజలు నిర్వహించారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం కావడంతో మండలంలోని ఆలయాలల్లో భక్తిశ్రద్ధలతో మహిళలు వరలక్ష్మివ్రత పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. అనంతరం వ్రతంలో పాల్గొన్న వారికి దేవస్థానం వారు అన్నదాన వితరణ గావించారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అభ్యంతరం





**పగిడ్యాల, ఆగసు 25, ప్రభాతవార్త :** నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కుల, మత, బాష ప్రాతం, పురుష, స్త్రీ అనే తారతమ్యం బేధంలేకుండా అన్ని వర్గాలకు సమాన హక్కులు రాజ్యాంగంలో పొందపరచడంతోపాటు చదువు, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్స్ కల్పించారు. ఆలాంటి మహామేధావిని ప్రపంచంఅంతా కొనియాడబడుతొంది. ఐక్యరాజ్యసమితి ఆంబేద్కర్ జయంతి సందర్భంగా అయన జన్మదినాన్ని విజ్ఞానాదినంగా ప్రకటించింది. ప్రపంచదేశాలు సహితం అంబేద్కకర్‌ను ప్రసంశిస్తున్నా మన సమాజంలో ఇంకా ఆయన పట్ల వివక్షత చూపడం విగ్రహాలు ఏర్పాటుచేసేందుకు అభ్యంతరం చెప్పడం, విగ్రహాలపట్ల కొంతమంది దుండగులు అమానవీయంగా వ్యవహరించినా పాలకవర్గాలు ప్రేక్షకపాత్రవహించడం వల్ల ఈలాంటి సంఘటనలుచొటుచేసుకుంటున్నాయి అనడంలో ఏలాంటి అతిశయోక్తిలేదు. అంబేద్కర్ జయంతి, వర్ధంతిలరోజు ఎక్కడలేని అభిమానం చూపి వేదికలెక్కి రాజకీయపార్టీలకుఅతీతంగా నాయకుల ప్రసంగాలు వింటే అశ్చర్యవేస్తుంది. వారి ప్రసంగాలకు అచరణకు ఏలాంటి పొంతనలేకుండా వ్యవహరించడం విడ్డూరం. రాజ్యాగంనిర్మాతను అవమానిస్తే రాజ్యాంగాన్ని అవమానించడమే. ఎస్సీలు వారికాలనీ సమీపంలో అంబేద కర్ విగ్రహాన్నిఏర్పాటు చేస్తుంటే స్థలం వివాదం సృష్టిస్తూ అక్కడ విగ్రహం పెట్టవద్దు మరోకచోట పెట్టండి అనీ అక్కడ వీరముసలయ్యస్థలం మాదిఅనీ వాల్మీకి నగర్‌అనీ బోర్డును ఏర్పాటు చేయడం వల్ల రెండు వర్గాల మధ్యల వాగ్వివాదం చోటు చేసుకున్న సంఘటన నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం పడమర ప్రాతకోటలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. రెండు గ్రూపులుగా ఏర్పడి వాల్మీకి నగర్, అంబేద్కర్ విగ్రహం పెట్టే స్థలం విషయంలో వాగ్వివాదం జరగడంతో సమాచారం అందడంతో ముచ్చుమర్రి ఎస్ నాగార్జున సిబ్బందితో అక్కడిచేరుకున్నారు. ఏలాంటి వాగ్వివాదాలకు జరగకుండా నచ్చజెప్పారు. శుక్రవారం మండల స్థాయి అధికారులు ఎంపిడిఓ బివి.రమణ, డిప్యూటీ తహశీల్దార్ మురళీమోహన్, ఎస్ఐ నాగార్జున సంఘటనా స్థలం పరిశీలించారు. ఇరువర్గాలు గర్షణపడకుండా పగిడ్యాల ఎంపిడిఓ కార్యాలయంలో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఇరువర్గాలనుంచి వారి సమస్యలను ఫిర్యాదులు స్వీకరించారు. తదుపరి ఎవరు గొడవలు పడకూడదనీ చెప్పారు. ఈలాంటి గోడవలు పునరావృతంకాకుండా ఇరువర్గాలపై బైడోవర్ కేసుకులు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున తెలిపారు.

## బొప్పాయి పంటను దున్నిన రైతు



**చాగలమర్రి, ఆగస్టు25, ప్రభాతవార్త:** మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే రైతు తాను సాగుచేసిన రెండెకరాల్లోని బొప్పాయి పంటను శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నేశాడు. గత సంవత్సరం రైతు రెండెకరాల్లో బొప్పాయి సాగుచేశాడు. పంట సాగుచేసినప్పటి నుంచి వర్షాలు సరిగాపడక తెగులు బారిన పడి పంట దిగుబడి సరిగా రాకపోవడంతో రైతు పంటను ట్రాక్టర్‌తో దున్నివేశాడు. దాదాపు రూ. 2లక్షలు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

## నవోదయ విద్యాలయాల్లో పరీక్షలకు 31 వరకు పొడింపు

నంద్యాల, విద్య, అగస్టు 25, ప్రభాతవార్త :

నవోదయ పాఠశాల్లో చేరుటకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 31వ తనకు పొడిగించారని విద్యాశాఖాదికారులు చెప్పారు. 5వ తరగతి చదివి 6వ తరగతిలో చేరడానికి పరీక్ష నిర్వహించ నున్నారు. ఈ గడవు ఈనెల 31 వరకు పొడించారని వారు చెప్పారు. కావున విద్యార్థులు దీనికి సద్వినియో గము చేసుకోవాలని వారు చెప్పారు.

## మహిళలకు పెద్దపీట వైసీపితోనే సాధ్యం - ఎమ్మెల్యే



**ఎమ్మిగనూరు, ఆగష్టు 25 ప్రభాతవార్తః** రాష్ట్రంలో మహిళలకు పెద్ద పీటం వేసిన ప్రభుత్వం అంటే ఒక్క వైసీపి ప్రభుత్వం అని శాసనసభ్యులు ఎర్రకోట చెన్నకేశవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహం నందు విలేకర్ల సమాశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్ సున్న వడ్డీ, చేయుత, ఆరోగ్య పరిస్థితి దృష్టి చేయుత అందించారని అలగే అమ్మఒడి ద్వారా ఎంతో మంది తల్లుల కళ్లలో ఆనందాని తెచ్చరన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన 2516 మందికి 251.6 లక్షలు, వాహన మిత్ర ద్వారా 292 మందికి 29.2 లక్షలు, వైఎస్ఆర్ ఇబిసి నేస్తం 195 మందికి ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రామాలను అందించి ఇచ్చిన వాటికి కంటే అధికంగా పథకాలు అందిస్తున్న పార్టీ ఒక్క వైసీపి పార్టీ అని అన్నారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ నజీర్ అహ్మద్, మండల నాయకులు, పోదుపు గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి



**కర్నూలు రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** కోడుమూరు నియోజకవర్గం కర్నూలు మండలంలోని పూడూరు, పడిదంపాడు గ్రామాలకు తారురోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని బిజెపి కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జ మీసాల ప్రేమ్‌కుమార్ కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం బిజెపి కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జ మీసాల ప్రేమ్‌కుమార్, కన్వినర్ సద్దల మధుకిషోర్, నాయకులు జిల్లా కలెక్టర్ సృజనను కలిసి పూడూరు, పడిదంపాడు గ్రామాల రోడ్డు సమస్యను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా మీసాల ప్రేమ్‌కుమార్ మాటాడుతూ పూడూరు, పడిదంపాడు గ్రామాలకు తారురోడ్డు వేయాలని గతంలో ఎన్నోసార్లు స్పందనలో అర్జీ ఇవ్వడం జరిగిందని అలాగే సార్వత్రిక ఎన్నికలు బహిష్కరించడం జరిగిందని తదుపరి స్థానిక ఎన్నికలను కూడా బహిష్కరించి జాతీయ రహదారి వెంకాయపల్లె దగ్గర 2గంటల పాటు ధర్నా చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులలో ఎలాంటి స్పందన లేకపోవడంతో రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు. గత కలెక్టర్ కోటేశ్వరరావు డిపిఆర్ తయారు చేశామని చెప్పారు కానీ అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఆ గ్రామస్తుల భాదను వారి యొక్క ధీనస్థితిని గమనించి ఇప్పటికైనా పడిదంపాడు, పూడూరు గ్రామాలకు రోడ్డు పనులు తక్షణమే మొదలుపెట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## జైయిన్ ఇరిగేషన్‌లో కలకలం - ఆరుగురు కూలీలు అస్వస్థత



**జూపాడుబంగ్లా, ఆగస్టు 25, ప్రభాతవార్త :** జూపాడుబంగ్లా మండలం తంగడంచ సమీపంలోని జైయిన్ ఇరిగేషన్ పరిశ్రమలో శుక్రవారం కలకలం రేగింది. జూపాడుబంగ్లాకు చెందిన ఆరుగురు కూలీలు తీవ్ర ఆస్వస్థతకు గురైయారు. 14 మంది కూలీలు పొలం పనుల నిమిత్తం జైయిన్ ఇరిగేషన్ పరిశ్రమకు వెళ్లారు. మొక్క జొన్న మొక్కల సుడిలలో ప్యూరడాన్ 3జి గుళికలు వేస్తుండగా వెంకటేశ్వరమ్మ, సుమలత, చంద్రకళ, విజయమ్మ, మెహరున్నిసా, శ్యామలమ్మలు తీవ్ర అస్వస్థతకు గురైయారు. మొక్కజొన్న మొక్కలు ఏపుగా పెరగడం, గుళికలు వేసే సమయంలో ఎండవేడిమి అధికంగా వుండడం, అధిక సాంద్రత కల్గిన రసాయనాలను పీల్చడం వల్ల ఆరుగురు కూలీలు వికారం మరియు తల తిరగడంతో అస్వస్థతకు గురైయారు. దీంతో కంపెనీ సిబ్బంది హుటాహుటినా జూపాడుబంగ్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. వైద్యాధికారి డాక్టర్ సభా పర్యవేక్షణలో స్టాఫ్ నర్సులు పుష్పవతి, షారూన్, సరితలు కూలీలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం వారిని 108 వాహనంలో నందికొట్కూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కూలీలకు గుళికలు వేయడంపై సరైన అవగాహన కల్పించడంలో కంపెనీ యాజమాన్యం విఫలమైందని పలువురు విమర్శిస్తున్నాయి. పురుగుల మందుల పిచికారీపై కూలీలకు ఎప్పకపుడు అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## వర్షం కోసం ముస్లీంల ప్రార్ధనలు



**ప్యాపిలి ఆగస్టు 25(ప్రభాతవార్త):** వర్షాకాలంలో సమృద్ధిగా కురవాల్సిన వానలు మొండికేశాయి. ఆగస్టు నెల ముగిస్తున్నప్పటికి వాన జాడ కనిపించడం లేదు. దేశంలోని పలు రాష్ట్రాలలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. కాని నంద్యాల జిల్లాలో చినుకులు రాలడం లేదు. ప్రతిరోజు వాన రాకకోసం మబ్బుల వైపు ప్రజలు తొంగి చూస్తున్నారు. వాన రావాలని కోరుతూ ప్రజలు ప్రత్యేక పూజలు, ప్రార్ధనలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ప్యాపిలి పట్టణంలోని జడ్పి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం హాఫిజ్ సాహెబ్, జామియా మసీదు మౌలానా మహబూబ్‌ఖాన్ ఆద్వర్యంలో ముస్లీంలు సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానలు రాక పోవడం వల్ల ప్రజలు తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నారని, వర్షాలు కురిస్తే సకల జీవకోటి సంతోషంగా ఉంటాయని పేర్కొన్నారు. వానలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని అల్లాను ప్రార్ధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు, గంజిఖానా మసీదు, షాధీఖానా మసీదు, మదీనా హప్సా మసీద్ ముస్లీం సోదరులు పాల్గోన్నారు.